
# రామగీత



వ్యాఖ్యాత :

బ్రహ్మశ్రీ యల్లంరాజు శ్రీనివాసరావు

# రామ గీత

ప్రణేత

**వాల్మీకి మహర్షి**

వ్యాఖ్యాత

యల్లంరాజు శ్రీనివాసరావు, M.A.

గ్రంథ నామము : రామ గీత
వ్యాఖ్యాత : యల్లంరాజు శ్రీనివాసరావు

ముద్రణ కాలము : సెప్టెంబరు - 2013

గ్రంథ మూల్యము : రూ. 40/-
ప్రతులు : 500
డి.టి.పి. : రితిక్ ఇమేజస్
విజయవాడ - 2, సెల్ : 9490334097
ప్రాప్తి స్థానము : 1. యల్లంరాజు శ్రీనివాసరావు
F1, వేంకటసాయి టవర్సు,
పాపరాజు వీధి, సత్యనారాయణపురం
విజయవాడ - 520 011
ఫోన్ : 0866-2538526
2.. యం. సుధాకర్
సత్యనారాయణపురం,
విజయవాడ - 520 011.
సెల్ : 94405 24168

## విషయసూచిక

ప్రారంభము ........ 3
1. ప్రస్తావన ........ 5
2. పూర్వగీత ........ 10
3. ఉత్తరగీత ........ 57
4. పరిసమాప్తి ........ 71

# ప్రారంభము

నేనీ రామగీతకు వ్యాఖ్యానం వ్రాసి ఒక పుస్తక రూపంగా ప్రకటించాలని ఎప్పుడూ అనుకోలేదు. కాకపోతే అందులో శ్లోకాలు చాలా గొప్పగా ఉండటం మూలాన నా ఉపన్యాసాలలో అక్కడక్కడా సందర్భోచితంగా ఉదాహరిస్తూ వచ్చేవాణ్ణి. అవి కాసెట్లుగా సీడీలుగా మా శిష్యులందరి చేతులలోకి వచ్చి కర్ణాకర్ణిగా శ్రోతలందరూ వినటం తటస్థించింది.

అలాటి శ్రోతలలో అగ్రగణ్యురాలు మా సీతాదేవి. ఎవరోగాదావిడ. వాణిజ్య పన్నుల శాఖలో అసిస్టెంటు కమిషనరుగా పనిచేసి రిటైరైన విదుషీమణి. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ నన్నెంతో కాలం నుంచీ వింటూ వచ్చిన శిష్య శిఖామణి, గొప్ప ప్రజ్ఞావతి. సౌజన్యవతి – సర్వజనహితైషిణి. అన్నిటినీ మించి మంచి దైవభక్తి సంపన్నురాలు.

ఆవిడ ఈ శ్లోకాలు విని ఇవి చాలా అద్భుతంగా ఉన్నాయి. ఎప్పుడైనా వీటిమీద మాటాడి మీరు వాటి ఆంతర్యం వివరించి చెబితే బాగుంటుందని కోరింది. ఆవిడ కోరిక కాదనలేక ఇటీవల నేను హైదరాబాదు కార్యక్రమానికి

వెళ్లినప్పుడిదీ ఒక సత్కార్యంగా భావించి మా వెంకట రామశాస్త్రిగారి ఇంట్లో నలుగురమూ సమావేశమై దీన్ని సాంగోపాంగంగా వివరించటం జరిగింది. అది వారు కాసెట్టు చేశారు కూడా. అది ఒక పుస్తకరూపంగా అచ్చువేస్తే భక్తాదు లందరికీ పంచిపెట్టాలనే కోరిక ఆవిడ మరలా వెలిబుచ్చింది.

అలాగేనని చెప్పి నేనా కాసెట్టు విజయవాడకు తెచ్చి మా శిష్యురాలు చి॥సౌ॥ విజయలక్ష్మి చేతికిస్తే దాన్ని కాగితం మీద పెట్టి నాచేతి కిచ్చిందావిడ. అది మరలా నేను అచ్చు వేయించి ఆ కాపీలు సీతాదేవిగారి కందజేస్తే ఆవిడ మీబోటి జిజ్ఞాసువు లందరికీ భగవత్ప్రసాదంగా వీటిని పంచి పెట్టింది. ఇందులో నా ప్రమేయమేమీ లేదు. నేను నిమిత్తమాత్రుణ్ణి. అంతా ఆవిడదే. ఆర్థికంగా హార్దికంగా మా సీతాదేవే శ్రీరామ కైంకర్యాన్ని సాగిస్తూ ఆ మహోత్సవంలో నన్నొక వ్యాఖ్యాతగా మీ అందరినీ శ్రోతలుగా చేసి మనకూ ఆ రామభక్తి రసామృతాన్ని ఈ గ్రంథమనే సువర్ణ కలశంలో నించి పంచి పెడుతున్నది.

**ఇతి**

**రస పాన పరితోషీ**

**– శ్రీనివాస మనీషీ –**

# ప్రస్తావన

మనకు ఇద్దరే ఉన్నారు మహర్షులు, మహర్షులైనా వారే. మహా కవులైనా వారే. వారెవరో గాదు. వాల్మీకి మహర్షి ఒకరు. వ్యాసమహర్షి ఒకరు. మానవ జీవితానికి గమ్యమేదో దాన్ని దర్శించిన వాడే ఋషి. అది మరలా లోకానికి వర్ణించి చెప్పగలిగినవాడు కవి. దర్శనా దృషిః - వర్ణనాత్కవిః అన్నారు మన పెద్దలు. అయితే ప్రతి ఒక్కడూ మనలో ఏదో ఒకటి చూస్తూనే ఉంటాడు చెబుతూనే ఉంటాడు గదా. అతడు ఋషి ఎలా అయ్యాడు. మనమంతా మామూలు మానవులమెలా అయ్యామని అడుగుతారేమో. మనదీ దర్శనమైనా దీనికి వ్యాప్తి లేదు. దేశంలో కాలంలో వస్తువులో ఎక్కడికక్కడ పరిమిత మైనదిది. సర్వతోముఖ మైనది గాదు. కనుక పెద్ద పెద్ద శాస్త్రజ్ఞులతో Scientists సహా కేవలం మానవ మాత్రులం మనమంతా.

పోతే ఈ మానవ జాతిలోనే పూర్వజన్మ సుకృత మనండి. వర్తమాన కృషిఫల మనండి. ఎవరీ మూడు పరిధులనూ దాటిపోగలరో - మరలా దిగివచ్చి ఆ చూచిన సత్యాన్ని లోకులకు చాటి చెప్పగలరో- వారే ఋషులూ వారే కవులని పేరు గాంచారు. అందుకే మహర్షులైనా మహాకవులైనా ఆ ఖ్యాతి వారికే దక్కుతుందని చెప్పటం. ఆ ఇద్దరిలో ఒకరు మహాభారత కర్త వేదవ్యాసుడైతే ఇంకొకరు శ్రీమద్రామాయణ కర్త వాల్మీకి. వారు రచించిన

ఆ రెండు ఇతిహాసాలలో ఎన్నో కథా సన్నివేశా లుండవచ్చు. ఎంతోమంది పాత్రలను వారు సృష్టించి ఉండవచ్చు. వారి మనోభావాలూ చేష్టలూ ఎన్నో విధాలుగా వర్ణించవచ్చు. ఆ కథల మీదా పాత్రల మీదా లేదు వారి దృష్టి. అదంతా అర్ధకామాల వరకే Public and Private Life పరిమితం. నాలుగు పురుషార్ధాలలో అర్థకామా లనేవి ఐహికం. జీవిత పరమార్ధమేదో అది మనకు బోధించ లేవవి. భారత రామాయణ కథలెవరికి తెలియవు. అవన్నీ మన దైనందిన జీవితంలో నిత్యమూ మనం చూస్తున్న సన్నివేశాలే. ఆయా పాత్రల కష్టసుఖాల లాంటివే మన జీవితాలలోనూ మనం ప్రతిక్షణమూ అనుభవిస్తూ ఉన్నాము. మనకు లేకపోతే గదా క్రొత్తగా మనం వాటిని పోగు చేసుకోటానికి. ఉన్న కర్మకు ఉపాకర్మ అన్నట్టు అది ఒక లేనిపోని భారం మన మనస్సుకు.

కాబట్టి ఐహికమైన అర్థకామాలు చాలా తగ్గురక మైనవి. ఇవి రెండే కావు పురుషార్ధాలు. ఇవి ఐహికమైతే మరి రెండున్నాయి ఆముష్మికమైనవి. అందులో ఒకటి ధర్మం. మరొకటి మోక్షం. ధర్మమంటేనే చాలు రెండూ కలిసి వస్తాయి. ఎలాగంటే ప్రవృత్తి నివృత్తి అని ధర్మాన్నే రెండుగా విభజించారు మన పెద్దలు. లోకవ్యవహారంలో తలదూరిస్తే అది ప్రవృత్తి ధర్మం. లోకాతీతమైన తత్త్వాన్ని అన్వేషిస్తూ పోతే నివృత్తి ధర్మం. ప్రవృత్తి ధర్మం మంచి చెడ్డలను రెండింటినీ బయటపెట్టి అందులో చెడ్డను పరిహరించి మంచి నాచరిస్తూ పొమ్మని బోధిస్తుంది. నివృత్తి ధర్మమలా కాక దీనికంతటికీ మూలభూత మైనదేదో దాన్ని పట్టుకొని దాని విభూతిగా ఈ సమస్తాన్నీ చూడమని ఉపదేశిస్తుంది. ఈ నివృత్తి ధర్మాన్నే మోక్షమనీ

ఆ ప్రవృత్తి ధర్మాన్నే కేవలం ధర్మమనీ తరువాత శాస్త్రజ్ఞులూ లోకులూ వ్యవహరిస్తూ వచ్చారు.

పోతే ఈ ధర్మమోక్షాలే అసలు జీవిత గమ్యాన్ని చేర్చే సాధనాలు గనుక వీటిని మనకు బోధించటమే కర్తవ్యంగా భావించారు మహర్షులు. కథలూ పాత్రలూ సన్నివేశాలూ వారికి వివక్షితం Intention కాదు. కేవలం వాటిని బోధించటాని కాలంబనంగా చేసుకొన్న ఒక సామగ్రి మాత్రమే. అందులోనూ ధర్మ ప్రధానమైనది రామాయణమైతే మోక్షప్రధానమైనది మహాభారతం. రాముడు కృష్ణుడు – వీరిద్దరూ ఒకరు ధర్మానికీ వేరొకరు మోక్షానికీ ప్రతీకలు Symbols గా నిలబడతారు. నిలబడతారంటే ఎక్కడ ఉన్నారా రామకృష్ణులు. వ్యాస వాల్మీకులు సృష్టించిన పాత్రలవి. తాము దర్శించిన సత్యాన్ని తాముగా వాచ్యం చేసి చెబితే అది శాస్త్రమేగాని Science కావ్యమని Art పెంచుకోదు. మానవుల మనస్సుల కది అంత రంజకంగా ఉండదు. బాగా మనసుల కది హత్తుకోదు. కనుక ఆ భగవానుడి ద్వారానే అందజేస్తే భయభక్తులతో వింటారు లోకులని భావించి ఉంటారా మహానుభావులు. భగవానుడికీ లోకులకూ ఏమిటి సంబంధం. ఎక్కడో దూరాన కూచొని ఆయనగారు బోధిస్తే మాత్ర మిక్కడెక్కడో భూమిమీద నివసిస్తున్న మానవుడెలా వినగలడని సందేహించవచ్చు మనం. అందుకోసమా మాధవుణ్ణి మానవుడి స్థాయికి దించి తీసుకువచ్చి ఒక మహర్షి రామావతార రూపంగా మరొక మహర్షి కృష్ణావతార రూపంగా మన ఎదుట నిలిపి వారి నోటనే పలికించారా రెండు పురుషార్థాలనూ. ఇది ఆ మహర్షులు లోకానుగ్రహ బుద్ధితో ప్రదర్శించిన ఒక గొప్ప గారడీ.

అందులోనూ రాముడు ధర్మమనేది ఏమిటో లోకానికి బోధిస్తే కృష్ణుడు మోక్ష స్వరూపాన్నే ఉపదేశిస్తూ పోతాడు. అలా ఇద్దరూ రెండు పురుషార్థాలనూ పంచుకొని మనకు వర్ణించి చెప్పినా అందులో ఒక చమత్కారముంది. అదేమిటంటే కృష్ణుడు మోక్ష పురుషార్థాన్ని ఉపదేశించినా అందులో ధర్మం కూడా తొంగి చూస్తుంటుంది. పోతే రాముడు ధర్మాన్నే చాటి చెప్పినా మోక్ష పురుషార్థం కూడా అక్కడక్కడా గుప్తంగా ధ్వనిస్తూనే ఉంటుంది. ఆ కృష్ణుడు చేసిన బోధే భగవద్గీత లేదా ఈశ్వర గీత. కృష్ణ గీత అని కూడా దానినే పేర్కొనవచ్చు. కాగా ఇక రాముడు చేసినది రామగీత కావలసి ఉంది. అది ఎక్కడ చేశాడా బోధ అంటే అధ్యాత్మ రామాయణం చూపుతారు చాలామంది. అందులో రాముడు లక్ష్మణుడికి చేసిన ఉపదేశమది. దానినే రామగీత అని పేర్కొంటారందరూ. కాని అది వాల్మీకి రచన గాదు. కాకుంటే మరెవరిది. విశ్వామిత్ర కృతమంటారు. దానికి ప్రామాణ్య మంతగా కానరాదు. పైగా అది భగవద్గీత కంటే అదనంగా చెప్పిన అంశమంటూ ఏ ఒక్కటీ బయటపెట్టదు. పోతే ప్రస్తుతం మనం రామగీత అని పేర్కొంటున్నది వాల్మీకి రామాయణంలో రాముడు స్వయంగా చేసిన ఉపదేశం. ఒక ముప్పది ఆరు శ్లోకాలలో సంక్షిప్తంగా చేసినది. కృష్ణగీతలాగా విపులంగా గాక పోయినా సంగ్రహంగానే జీవిత సత్యాల నన్నింటినీ భావుకుడి మనస్సుకు బాగా హత్తుకొనేలాగా అందించిన సందేశమిది. అజరామరమైన సందేశం.

ఇది రామాయణంలో రాముడు మనకు రెండు సన్నివేశాలలో అందజేసిన గొప్ప సందేశం. ఒకటి అయోధ్యాకాండలో. మరొకటి కిష్కింధా

కాండలో. వాటిలో రామగీత ఎక్కడ ఉందా అని మనం దుర్భిణీ పెట్టుకొని చూస్తేగాని కనిపించదు. చాలా గుప్తంగా ఉంటుంది. కృష్ణుడిలాగా రాముడు హడావుడి చేయడు. అల్పసంతోషి. చెప్పిందే చెబుతూ పోతాడు కృష్ణుడు. అందుకే అంత పెద్దదయింది కృష్ణగీత పరిమాణంలో. ఎంత పెద్దదయినా 18 అధ్యాయాలలోనూ చెప్పిన విషయాలు రెండే. ఒకటి కర్మయోగం - మరొకటి జ్ఞానయోగం. అది కూడా పైకి రెండుగా కనిపించినా ఆంతర్యంలో ఒకే ఒక యోగమని తేలుస్తాడు చివరకు. మరి ఈ రామగీత అలా కాదు. మానవ జీవితానికి పట్టుకొన్న సమస్య ఏమిటో దానికి పరిష్కారమేమిటో అన్ని కోణాల నుంచీ చూచి అంతా మూటగట్టి మనకు చాలా క్లుప్తంగా అందిస్తాడు రాముడు. ఇది కొన్ని లక్షల పొటెన్సీతో కూడుకొన్న దివ్యౌషధ మనుకోండి. అలాంటి రామగీత మనమిప్పుడు పాఠం చెప్పుకోబోతున్నాము. బాహ్యార్థంతోపాటు అంతరార్థం కూడా సూచన చేయవలసి ఉంది. అప్పుడే దానికి సమగ్రత.

**ఇతి**

**బుధ జన విధేయః**

**శ్రీనివాస నామధేయః**

## పూర్వ గీత

మొట్టమొదట రామోపదేశం అయోధ్యాకాండలో జరిగింది. తండ్రి ఆజ్ఞ శిరసావహించి రాము డరణ్యవాసం చేస్తున్నాడు. భరతుడాయన నెలాగైనా పట్టణానికి తీసుకువచ్చి పట్టాభిషిక్తుణ్ణి చేయాలని పట్టుపట్టాడు. మాతృ మంత్రి పరివార సమేతంగా దండకారణ్యానికి బయలుదేరాడు. అక్కడ అన్నగారి పాదాలు పట్టుకొని తండ్రిగారి మరణవార్త తెలుపుతూ విలపించసాగాడు. అది చూచి రాముడతణ్ణి ఓదారుస్తూ మాటాడుతున్న సందర్భమిది.

**తమేవం దుఃఖితం ప్రేక్ష్య - విలపంతం యశస్వినమ్**

**రామః కృతాత్మా భరతం - సమాశ్వాసయ దాత్మవాన్ - 1**

దుఃఖితం భరతం – తండ్రి పోయాడే అన్న అడవుల పాలయ్యాడే అని బాధపడుతున్నాడు భరతుడు. విలపంతం. అయ్యో అని ఆక్రందన చేస్తున్నాడు. పోనీ తెలియనివాడా అంటే యశస్వినం – చాలా గొప్ప జ్ఞాని అని లోకానికంతా విదితమే. అయినా సందర్భ మలాంటిది. అయితే రాముడెలాంటి వాడు. కృతాత్మా – ఒకరికి చెప్పాలంటే దానికి యోగ్యత

Qualification ఉండాలి. అది ఎంతైనా ఉంది రాముడికి – కృతాత్ముడతడు. కృత అంటే సంస్కృత అని అర్థం. బాగా పరిశుద్ధమైన ఆత్మగలవాడు. ఆత్మ అంటే ఇక్కడ మనస్సు. మనస్సు బాగా పరిశుద్ధమైతే రజస్తమస్సులు క్షాళితమై సత్త్వశుద్ధి ఏర్పడుతుంది. అప్పుడాత్మవాన్ ఆత్మజ్ఞాన మున్నవాడవుతాడు. కర్తృత్వభోక్తృత్వాలకు సాక్షి అయిన ప్రత్యగాత్మ స్థాయి కెదుగుతాడని భావం. జీవభావం కన్నా పయి స్థాయి అది. ఆ స్థాయిలో ఉన్నవాడే సంకల్ప వికల్పాలతో నలిగిపోతున్న జీవాత్మ కేదైనా బోధించ గలడు.

ఇక్కడ ధర్మ పురుషార్థ మెలాటిదో అది వర్ణించి చెబుతున్నాడు వాల్మీకి మహర్షి. కాని ఆయన మాటలు కొంచెం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి మనం. కృతాత్మా ఆత్మవాన్ – అన్నప్పుడది కేవలం ధర్మం వరకే ఆగక దాని కతీతమైన మోక్ష పురుషార్థాన్ని కూడా సోకుతున్నది. మోక్ష భూమికలో ఉన్నవాడైతే కేవల మర్థకామాలలో ఉండే మంచి చెడ్డలనే చెప్పగలడు. అనగా అంతకంతకు పయి లెవల్‌కు వెళ్ళిన వాడే క్రింది లెవల్ వాడికేది కావాలో అది మాత్రం చెప్పగలడు. అంతేగాని అంతకన్నా అతీతమైన దాన్ని బోధ చేయలేడు. ప్రస్తుతం రాముడవతార పురుషుడు గనుక కేవలం దశరథ రాముడు కాడు. ఆత్మారాముడు. తాను పరమాత్మనని తనలో తనకు బాగా తెలిసినవాడు. అదే కృతాత్మా ఆత్మవాన్ అనే మాటలలో మహర్షి చేస్తున్న సూచన. అలాంటి ఆత్మజ్ఞాన సంపన్నుడు గనుకనే అది

లేక ప్రకృతి జన్యమైన సుఖదుఃఖాలకు లొంగిపోయి ఆక్రందన చేస్తున్న తమ్ముణ్ణి సమాశ్వాసయత్ – ఓదార్చవలసి వచ్చింది. సర్వజ్ఞుడైన ఆచార్యుడే అల్పజ్ఞానంతో సతమతమయ్యే శిష్యుడికి తత్త్వోపదేశం చేసివాడికి శోకోపశమనం చేయగలడని మహర్షి హృదయం. దీనికి ప్రతిధ్వనే భగవద్గీతలోని **అశోచ్యానన్వశోచస్త్వం** అనే శ్లోకభావం. రాముడే కృష్ణుడికి దారి చూపాడని చమత్కారంగా చెప్పుకోవచ్చు.

**నాత్మనః కామకారోస్తి - పురుషోయ మనీశ్వరః**

**ఇత శ్చేతరత శ్చైనం - కృతాంతః పరికర్షతి - 2**

ఆత్మజ్ఞానం లేకనే నీవిలా విలపిస్తున్నావని భరతుణ్ణి ఊరడిస్తూ రాముడొక మాట అంటాడు. భరతా నీకొక రహస్యం తెలియదు. అదేమిటంటే లోకంలో ఏ మానవుడికీ తన ఇష్టానుసారంగా ప్రవర్తించే శక్తి లేదు. కామకారమంటే ఇష్టానుసారమని అర్థం. పురుషుడంటే మానవుడు. పూర్ణత్వ మున్నవాడు గదా పురుషుడంటే. కావచ్చు. అది క్రిమి కీటక పశుపక్ష్యాదుల దృష్ట్యా చెప్పిన మాట. వాటిలో దేనికీ లేని ఆలోచనా శక్తి వివేచనా శక్తి ఉన్నవాడు గనుక పూర్ణుడయ్యాడు గాని మిగతా విషయాలలో వీడూ జంతువులతో సమానుడే. వాటిలాగే వీడికీ ఆహార నిద్రా భయ మైథునాదులూ ఆధివ్యాధి జనన మరణాది భయాలూ – ఎప్పుడూ ఉంటూనే ఉన్నాయి. కనుక పురుష అనే మాట ఆపేక్షికమే. Relative పూర్ణ పురుషుడు కాడు. అనీశ్వరుడు. సామర్థ్యం లేదు ఏ

విషయంలోనూ. నీ చెప్పు చేతలలో లేదు నీ జీవితయాత్ర. నీవొక విధంగా బ్రతకాలని సంకల్పిస్తే మరొక విధంగా బ్రతకాలిసిన వికల్ప మేర్పడుతుంది.

శరీరమూ ప్రాణమూ మనస్సూ – మూడే మనకున్న పరికరాలు, మూడూ చలనాత్మకమే. శరీరం తమోగుణాత్మకం. ప్రాణమూ మనస్సూ రజో గుణాత్మకం. సత్త్వగుణ మెక్కడ ఉంది మరి. ఆ మనసులోనే ఉంది దాని కవకాశం. ప్రాణానికి లేదా అవకాశం. అది కేవల చలనాత్మకమే. మనసు చలించినా దానికి ఆలోచించే జ్ఞానముంది. అయితే అది ఎప్పటి కప్పుడు మారుతుంటుంది. నిలకడలేదు. దానికి కారణం అది నామ రూపాలకు చెందిన విశేషజ్ఞానం కావటమే. దానివల్ల అనీశ్వరః – అసమర్థు డవుతున్నాడు మానవుడు. అసమర్థుడు గనుకనే ఇతశ్చేతరతశ్చ– ఇటూ అటూ వాణ్ణి లాగి పారేస్తుంటాడు. పరికర్షతి – ఎవడా పరికర్షణ చేస్తున్నది. కృతాంతః – దైవశక్తి. విధి అని కూడా దానికే పేరు. ఏది విధిస్తుందో అది విధి. సుఖమో దుఃఖమో ఎప్పుడేది వీడను భవించాలో అది వీడి అనుభవానికి తెస్తుంది. దానికేమిటంత కచ్చే ఈ మానవుడి మీద నంటావా. వీడింతకు ముందు చేసుకొన్నాడు గనుకనే దాని కనుగుణమైన ఫల మందిస్తుంది. కర్తృత్వం వీడిదే.

అసలు కర్తృత్వం భోక్తృత్వం – ఈ రెండు లక్షణాలున్న వాడే మానవుడు. ఒక పని చేస్తాడు. అప్పుడు వీడు కర్త. దాని ఫలితం సుఖమో దుఃఖమో అనుభవిస్తాడు. అప్పుడు వీడే భోక్త. ఇది ఒక పరంపర. గతంలో

చేసుకొన్నది వర్తమానంలో అనుభవిస్తుంటాము. అప్పుడది ప్రయత్నం. ఇప్పుడది ప్రారబ్ధమంటారు పెద్దలు. అయితే వర్తమానంలో బ్రతికే ఈ మానవుడికెన్ని జన్మలు గడిచాయో ఏ జన్మలో ఏమి చేస్తూ వచ్చాడో ఏ కర్మ ఇప్పుడు ప్రారబ్ధరూపంగా మారి ఫలిత మిస్తున్నదో ఏ మాత్రమూ తెలియదు. సర్వజ్ఞుడు కాడు గదా ఎలా తెలుస్తుంది. అందుకే అనీశ్వరుడు వీడు. అనీశ్వరు డెప్పుడయ్యాడో ఒక ఈశ్వరుడు చెప్పినట్టు వినాలి వీడు. వాడెప్పుడేది విధిస్తే మంచో చెడ్డో అది అనుభవించక తప్పదు. ఎవడా ఈశ్వరు డంటావా. కృతాంతః – కృతమంటే ఈ మానవుడు చేసిన మంచి చెడ్డలు ఎప్పుడు చేశాడో ఏమో వీడికి తెలియదు. గాని వాడికి తెలుసు. కృతాని కంతమేదో అది కృతాంతం. అంటే పుణ్యపాప కర్మల ఫలితం. అవే సుఖదుఃఖాలు. కృతమంతమైనా దాని ఫలితమంతం కాదు. ప్రారబ్ధ రూపంగా కొంత బయట పడుతుందది. మిగతాది సంచిత రూపంగా అలాగే నిలవ ఉంటుంది. మరలా కాలం దేశం నిమిత్తం – ఇవన్నీ కలిసి వచ్చినప్పుడదీ కొంతకు కొంత బయటికి వస్తుంది. అదే పునర్జన్మ. ఈ ప్రణాళికనంతా వేసి దీని కనుగుణంగా ఆయా జీవుల కాయా అనుభవాలిచ్చే వాడెంత సమర్థుడయి ఉండాలి. ఈశ్వరుడయి ఉండాలి. కృతాంతుడు కూడా అయి ఉండాలి. కృతాంతుడంటే కాల స్వరూపుడని కూడా అర్థమే. జనన మరణాదులన్నీ కాలాత్మకమే గదా.

ఇదంతా ధర్మపురుషార్థానికి సంబంధించిన వ్యవహారమైతే ఇందులో మోక్ష స్వరూపాన్ని కూడా వ్యంగ్యంగా సూచన చేస్తున్నాడు మహర్షి అదేమిటంటారా. పురుష అనీశ్వర కృతాంత అనే మూడు మాటల్లో పెట్టాడు మర్మమంతా. పురుషుడు వాస్తవంలో పురుషుడే సందేహం లేదు. అంటే పూర్ణ స్వరూపుడే. పరిపూర్ణమైన జ్ఞానమూ శక్తీ రెండూ సహజంగా ఉన్నవాడే. క్రొత్తగా సాధించి తెచ్చుకోవలసింది కాదు. సిద్ధమే అంతా. సాధ్యమేదీ లేదంటారు తత్త్వజ్ఞులు. అలాంటప్పుడు వీడీశ్వరుడే కావాలి గాని అనీశ్వరుడెలా అయ్యాడని ప్రశ్న. తనకున్న జ్ఞానైశ్వర్యాలను రెండింటినీ మరచిపోయా డవిద్య మూలంగా. అంచేత పూర్ణస్వరూపుడైనా ఈశ్వరత్వం కోలుపోయి అనీశ్వరు డనిపించు కొంటున్నాడు. అనీశ్వరు డెప్పుడయ్యాడో తన కృతాని కంతమైన సుఖదుఃఖాది ఫల మనుభవించవలసి వస్తున్నది. మరి దీనికేమిటీ పరిహారం. కృతాంత అనే మాటలో ఉందది. కృతమంటే అకృతం కానిది. అంటే సహజం కానిది. కల్పితం. అజ్ఞాన కల్పితమే ఈ కర్తృ భోక్తృ రూపమైన జీవభావం. దానినంతం చేసుకోగలిగితే కృతాంతు డవుతాడు తానే. అప్పుడు తనకు భిన్నంగా ఎవడూ ఈశ్వరుడూ లేడు. కృతాంతుడూ లేడు. లేకుంటే అప్పుడసలైన అర్థంలో పూర్ణత్వమున్న పురుషుడు తానే అవుతాడు. వేదాంతేషు యమాహు రేక పురుష మన్నట్టు పురుషుడూ తానే పురుషోత్తముడూ తానే. ఎందుకంటే పూర్ణత్వాలు రెండుండవు. ఒక్కటే. అంటే జీవేశ్వర భేదం చెరిగిపోతుంది. అజ్ఞానం

వల్ల ఏర్పడింది వాస్తవం కాదు గనుక వాస్తవమైన జ్ఞానముదయిస్తే చాలు. అంతా మటుమాయం. ఏతావతా అలాంటి ఆత్మజ్ఞానం సంపాదించు నీవు కూడా ఓ భరతా. అప్పుడే విషాదమూ నీమీద పనిచేయదని ఆత్మారాముని బోధ.

**సర్వే క్షయాంతా నిచయాః - పతనాంతా స్సముచ్ఛ్రయాః**

**సంయోగా విప్రయోగాంతా - మరణాంతంచ జీవితమ్ - 3**

పోతే అలాటి ఆత్మజ్ఞానం కలగాలంటే అది నూటికి కోటికే ఒక్కడికో. మిగతా తొంభయి తొమ్మిదిమందీ అజ్ఞానులే. ఆత్మలోగాక వారందరూ దాని ఆభాస అయిన ప్రపంచ వ్యవహారంలోనే మునిగి తేలుతుంటారు. ఆ భాసనే వాస్తవమని నమ్మి ఇది ఎప్పటికీ ఉంటుందని చెప్పి ఇందులో తాము కోరినదంతా పోగు చేసుకోవాలని అనుభవించాలని ఉబలాటపడతారు. నిచయాః ధనకనకాదులూ వస్తువాహనాదులూ గుహారామక్షేత్రాదులూ – ఇలాటివన్నీ పోగు చేసుకొంటూపోతారు. కాని క్షయాంతాః – ఎప్పటికైనా అవి క్షీణించి పోయేవే అని తెలియదు వాళ్లకు. ఎంతెంత పోగు చేసుకొన్నా అదంతా చివరకు నశించిపోయేదే. అలాగే పతనాంతాః సముచ్ఛ్రయాః – సముచ్ఛ్రయమంటే ఉన్నతమైన స్థితి. ఎంతెంత ఎత్తుల కెదిగామని సంతోషిస్తారో అంతగా చివరకు పడిపోవలసిందే. పెరుగుట విరుగట కొఱకే అన్నట్టు ఉత్పతనం పతనానికే ఎప్పటికైనా. అలాగే సంయోగా విప్రయోగాంతాః – పండగా పబ్బానికీ నలుగురూ కలుసుకొని ఎంత

ఆలజాలంగా ఉన్నామని ఆనందించినా చివరకందరూ విడిపోవలసిందే. యోగం వియోగంతో అంతమైపోక తప్పదు – అంతేగాదు. ఇదంతా ఒక ఎత్తు. జీవితాంతమూ ఎంత భోగభాగ్యాలతో తులతూగినా చివరకేనాడో ఒకనాడు కన్నుమూయ వలసిందే. అప్పుడిదంతా వదలిపెట్టి పోవలసిందే. అదే చెబుతున్నాడు రాముడు. మరణాంతంచ జీవితమని. ఎంత గొప్ప జీవితమైనా మరణంతో సమాప్తం.

వ్యావహారిక దృష్టితో చూచినా ఇది ఎంతో అద్భుతమైన బోధ. సర్వేక్షయాంతా అనేది లోకంలో కోట్లకు పడగలెత్తిన పెద్ద పెద్ద ధనవంతులనూ వ్యాపారస్థులనూ దృష్టిలో పెట్టుకొని చేసిన హెచ్చరిక. మీరు మీ జీవితంలో అనుక్షణమూ అవీ ఇవీ పోగు చేసుకోవాలనే ప్రాకులాడు తున్నారు. మీరెంత తాపత్రయపడ్డా అది ఎంతో కాలం నిలవదు. ప్రాప్తమున్నంత వరకే సుమా మీకది దక్కేది. అనుభవించే యోగం లేదో ఉన్నట్టుండి రెక్కలు వచ్చి ఎక్కడికి ఎగిరిపోతుందో చెప్పలేము. కరి మ్రింగిన వెలగ పండులాగా చూస్తూ చూస్తుండగానే మాయమైపోగలదు. కనుక మీరది గుర్తుంచుకొని ఉన్నవాళ్లు లేనివాళ్లకు సహాయం చేసివారికి కూడా మీలాటి అనుభవాన్నే కలిగించండి. వారికీ మీకూ అది తృప్తి. అలాగే పతనాంతాః సముచ్ఛ్రయాః అని పెద్ద పెద్ద పదవులలో ఉన్నాం మనకేమని విఱ్ఱవీగే పాలక వర్గాన్ని హెచ్చరిస్తున్నాడు. మీరు గడ్డి దిగి కంపదిగి తిమ్మిని బ్రహ్మిని చేసి ఎంత గొప్ప స్థాయి కెదిగామని సంతోషించినా లాభం లేదు.

అది తాత్కాలికమే. దక్కేయోగం లేకపోతే ఎంత ఎత్తుల కెదిగారో అంత పాతాళానికి పడిపోవలసి వస్తుంది. గత చరిత్ర ఒకసారి జ్ఞాపకం చేసుకొండి. ప్రతి దేశంలో నిరంకుశ పరిపాలకుల జీవితంలో ఇలాటి పతనాన్ని వారెలా చవిచూచారో మీకే తెలిసిపోతుంది. కాబట్టి ప్రజా సామాన్యంలో మీరూ ఒకరనే సత్యాన్ని మరచిపోకుండా నిరహంకారంగా బ్రతకటం నేర్చుకోమని వారికిది హెచ్చరిక. అలాగే పారిశ్రామికులే గాదు. తత్తద్దేశ పాలకులే గాదు. సామాన్య గృహస్థులను కూడా మందలిస్తున్నది సంయోగా విప్రయోగాంతా అనే మూడవ వాక్యం. బంధుమిత్రాదులతో ఆలుబిడ్డలతో ఆలజాలంగా కాలం గడుపుతున్నాము గదా అని ఉప్పొంగి పోతున్నారేమో. అదీ ఎంతో కాలం సాగదా జీవితం. ఈ కలయికలన్నీ ఎప్పుడే క్షణంలో తొలగిపోయినా పోవచ్చు. అప్పుడెంత వాపోయినా ప్రయోజనం లేదు. కాబట్టి అది సంభవించే లోపుగానే దానికి మానసికంగా తయారయి ఉండండని హెచ్చరిక. పోతే ఇక ధనవంతులేమిటి రాజకీయ నాయకులేమిటి. సామాన్య గృహస్థులేమిటి. ఒక వర్గానికంటూ చెప్పటం కాదు. సమస్త మానవ కోటికీ సర్వసాధారణంగా చాటి చెప్పే ఆఖరి మాట ఏమిటంటే మరణాంతంచ జీవితమనేది. ఎంత భోగాలనుభవించినా ఎన్ని పదవులు కైవసం చేసుకొన్నా అలాగే ఆత్మీయులతో ఎన్నాళ్లు సుఖంగా గడిపినా చివరకెప్పుడో ఒకప్పుడింత జీవితమూ మరణంతో ముగిసిపోయేదే. ఆ తరువాత మనమూ లేమూ – మన అనుభవాలూ లేవు. అంతా హుళక్కే.

అంచేత చిన్నేమిటి పెద్దేమిటి. పండితుడేమిటి పామరుడేమిటి. ఎవడే దశలో ఉన్నా ఎంత గొప్ప అనుభవమైనా అది ఖాళీ అయిపోయేదే. కనుక దానిమీద గాదు మనకు చూపుండవలసింది. ఇందులో ప్రతి ఒక్కటీ అంతమై పోయేదేనని ఎప్పుడు చెప్పామో అంతం కానిదేదో దాన్ని గదా మానవుడు అన్వేషించవలసింది. అనుభవానికి తెచ్చుకోవలసింది. అంతమయ్యే దెప్పుడూ అనంతమైన దాన్ని సూచిస్తుంటుంది. అది క్షయం లేని నిచయం. పతనం లేని ఉత్పతనం. వియోగం లేని సంయోగం. మరణంలేని జీవితమూ అయి ఉండాలి. అప్పుడీ వ్యావహారికమే మన దృష్టిని పారమార్థికంవైపు తీసుకెళ్లుతుంది.

అది ఎలాగో కొంచెం లోతుకు దిగి చూడాలి మనమీ శ్లోకంలో. ఇప్పుడీ వృద్ధి క్షయాలూ ఆరోహణావరోహణలూ సంయోగ వియోగాలూ– ఇవన్నీ ద్వంద్వాలు. ఒకదానికొకటి విరుద్ధమైన భావాలు Opposite. వృద్ధి క్షయంగాదు. క్షయమనేది వృద్ధిగాదు. ఆరోహణ అవరోహణగాదు. అవ రోహణ ఆరోహణగాదు. అలాగే సంయోగం వియోగం గాదు. వియోగ మనేది సంయోగం గాదు. ఒకటి అనులోమమైతే మరొకటి ప్రతిలోమం. ఇది దాని దగ్గర అంతమైతే అది దీని దగ్గర అంతమైపోతుంది. ఒకదాని నొకటి వ్యాపించవు గనుకనే ఎక్కడి కక్కడ అంతమవుతాయి. అంటే ఎక్కడికక్కడ తెగిపోతాయి.

పోతే ఇవి రెండూ ఏది అనుభవిస్తున్నదో అది వీటి రెండింటినీ వ్యాపించి ఉండాలి గాబట్టి అది ఇలా తెగిపోదు. అంటే దానికి వీటిలాగా అంతం లేదు. ఏదది. మన స్వరూపం. మన స్వరూపం మన జ్ఞానమే. జ్ఞానమే వృద్ధి క్షయాలనూ యోగ వియోగాదులనూ అనుభవిస్తున్నది. అనుభవించాలంటే అది వీటికంటే ముందే సిద్ధమై ఉండాలి. అది ముందుంటేనే తరువాత వీటి అనుభవం. అనుభవం పూర్తి అయిన తరువాత అవి పోయినా కూడా ఇది ఉండితీరాలి. లేకుంటే మరలా ఇంకొకటి దాని అనుభవానికి రావటానికి వీలులేదు. కాబట్టి ఆది మధ్యాంతాలలో అనుభవించే జ్ఞానమొకటి ఈ ద్వంద్వాల ననుభవిస్తుండాలంటే దానికంత ముండరాదు. అంతం లేదంటే అనంతమది. అదే జ్ఞానమదే స్వరూపమదే ఆత్మ. అది ఇప్పుడు మన శరీరం మేరకే చూచి దానికి కూడా అప్పుడప్పుడంత మున్నట్టు మనం భ్రమపడవచ్చు. అది వృత్తిరూపమైన విశేషజ్ఞానం. సాక్షిరూపమైన సామాన్య జ్ఞానం కాదు. ఇప్పుడనంతమని మనం చెప్పుకొంటున్నది ఆ సామాన్య జ్ఞానం. అది ఈ వృత్తి జ్ఞానాన్నీ ఇందులో ప్రతిఫలించిన ఆయా నామరూపాలనూ కూడా వ్యాపించిన జ్ఞానం కాబట్టి అదే మన అసలైన స్వరూపమని గుర్తించగలిగితే చాలు. సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ అన్న బ్రహ్మతత్త్వాన్నే అందుకోగలడు మానవుడు. అందుకొంటే సుఖదుఃఖాది ద్వంద్వాలేవీ అంటవు మనలను. ఇదీ ఇందులో ధ్వనిస్తున్న ఆధ్మాత్మిక భావం. మాత్రా స్పర్శాస్తు కౌంతేయ అనే గీతా శ్లోకాని కీ రామగీతా శ్లోకం మార్గదర్శకమని తోస్తుంది నాకు.

**యథా ఫలానాం పక్వానాం - నాన్యత్ర పతనా ద్భయమ్**

**ఏవం నరస్య జాతస్య - నాన్యత్ర మరణాద్భయమ్ - 4**

మంచిదే. కాని మన ఆత్మకు అంతం లేదంటున్నారు మీరు. అంతం లేదంటే మరణం లేదనే గదా అర్థం. మరణం లేకపోతే ఈ మరణిస్తున్న వ్యక్తి ఎవరంటారు. నరుడే గదా. నరస్య జాతస్య. ప్రతి ఒక్క నరుడూ ఎప్పుడో ఒకప్పుడు జన్మిస్తూ ఉన్నాడు. జన్మ ఉందంటే మరణం కూడా ఉండి తీరవలసిందే. రెండింటికీ అవినాభావం. అదే గదా అంతం వాడి జీవితానికి. నాన్యత్ర మరణాద్భయం – మరణిస్తామనే భయమెక్కడా లేదంటారేమిటి. ఇది అనుభవానికే విరుద్ధం కదా. దీనికి ధర్మ పురుషార్థ దృష్ట్యా సమాధాన మేమంటే మరణమనేది సర్వనాశన మయిపోవటమని భ్రమపడుతున్నావు. అభావం కాదది, అవ్యక్తం. అంటే ఈ శరీరాన్ని వదిలేసి మరలా ఒక శరీరాన్ని ధరిస్తాడు మానవుడు. వదిలేసినప్పు డిక్కడ అవ్యక్తం Unmanifest వాడు. మరొక శరీరం ధరించినప్పుడక్కడ మరలా వ్యక్తమయికని Manifest పిస్తాడు. ఇదే జన్మాంతరం. ఇలా మరణానంతరం మరలా జననం ఆ జననాంతరం మరణం మరలా ఆ మరణానంతరం జనన మేర్పడుతుంటాయి కాబట్టి మరణిస్తే అక్కడికీ మానవుడాఖరై పోతాడు ఇకలేడని భయపడ నక్కరలేదు.

ఇది ఎలాటిదంటే ఫలానాం పక్వానాం ఒక చెట్టుకొక కాయ కాసింది. ఆ కాయ బాగా పండింది. ఇప్పుడా పండు రాలి క్రింద పడిపోయిందను

కోండి. ఆ పండుకూ భయం లేదా చెట్టుకంత కన్నా భయంలేదు. అది ఆ పండుకు మరణం కాదు. మరి ఒక జన్మ. ఎలాగంటే దానిలోని విత్తనాలు నేల లోపలికి వెళ్లిపోయి వర్షం పడగానే మరలా మొలకెత్తి మొక్కై మ్రానై కొమ్మై కాయై మరలా పండుగా తయారవుతుంది. ఇది దానికెలా పునర్జన్మో అలాగే మనకూ మరణం కాదిది. మరలా జన్మకే దారి తీస్తుందీ మరణం.

అయితే ఒక మాట. ఒక పిందెగానో కాయగానో ఉన్న దశలో అది రాలిపడితే సుఖం లేదు. పక్వమైతేనే సార్థకం. అలాగే మానవుడు యధా జాతు డనిపించుకో కూడదు. విద్యాబుద్ధులు గడించి సత్కర్మ లాచరించి దాని సంస్కారంతో బుద్ధి బాగా పరిపక్వమై నిష్క్రమించాలి ఈ శరీరం నుంచి. అలా నిష్క్రమించినప్పుడే మరుజన్మలో ఉత్తమ జ్ఞానమూ ఉత్తమ సుఖానుభవమూ పొందగలడు. అంతకంత కాయా జన్మలలో అభ్యుదయాన్ని సాధించి ఉత్తమోత్తముడుగా రాణించగలడు.

ఇలా ధార్మికంగానే గాక ఆధ్యాత్మికంగా చూచినా ఇందులో ఎంతో గంభీరమైన భావమిమిడి ఉంది. ఇక్కడ చెట్టనేది ఈ సంసారమే. లేదా పిండాండమైన ఈ శరీరమైనా కావచ్చు. ఇందులో పక్వమైన ఫలం బ్రహ్మ జ్ఞానమార్జించి అందులో పండిపోయిన మానవుడి మనస్సే. నిర్వికల్పమైన ఆ మనస్సు కేవల మఖండమైన నిరాకారమైన సర్వవ్యాపకమైన ఆత్మ స్వరూపమే కాబట్టి నాన్యత్ర మరణాద్భయమ్ - నేనెక్కడో పడిపోతున్నానే మరణిస్తున్నానే అనే చింతలేదు. ఎంచేత. ఏ భూమిలో నుంచి వృక్షరూపంగా

పైకి వచ్చిందో ఆ విత్తనం – ఫలరూపంగా అదే మారి అదే మరలా బీజరూపంగా నేలలో కలిసిపోతున్నది. అలాగే ఏ పరమాత్మ చైతన్యమిలా ఈ శరీరాన్ని సృష్టించుకొని ఇందులో తానే స్వయంగా వచ్చి ప్రవేశించిందో మరలా తన నిజస్వరూపమేదో గుర్తించి ఆ పరిపాకంతో మరలా ఆ విశ్వచైతన్యంతోనే ఏకమైపోతుంది. కనుక పైకి మరణమైనా వాస్తవంలో అది అమరమే. ఆ ఫలానికక్కడ పతనమైనా ఎలా పతనంకాదో ఇక్కడా ఈ జీవుడికి మరణమైనా అది మరణం కాదు. జీవితమే.

**యధాగారం దృఢస్థూణం - జీర్ణం భూత్వా ఉ వసీదతి**

**తథైవ సీదంతి నరా - జరామృత్యువశం గతాః - 5**

అలాంటి స్థాయికెదుగ లేనంత వరకూ ఆ సౌభాగ్యానికి నోచుకోలేదు మానవుడు. అప్పుడా మానవుడు నరుడే. నారాయణుడు కాదు. 'ఆపోనారా ఇతిప్రోక్తా నారా వై నరసూనవః' అని నర శబ్దానికి నిర్వచనం చెప్పారు. పంచభూతాలతో కూడిన ఈ శరీరమే నేనని దీనితో తాదాత్మ్యం చెందిన జీవ చైతన్యమే నర అనే మాట కర్థం. శరీరమనేది ఉపాధి Medium చైతన్యానికి. ఉపాధి సాకారం. చైతన్యం నిరాకారం. నిరాకారమైనా ఆకాశంలాగా నేననే స్ఫురణ లేనిది కాదు. కాబట్టి ఆకాశంలాగా అనాత్మ Object కాదు. ఆత్మ స్వరూపం Subject. అది స్వతః ప్రమాణం Self Evident గనుక ఎప్పుడూ స్వతస్సిద్ధమైన Self existant తత్త్వం. అంచేత దానికి జనన మరణాలు లేవు.

మరి ఈ జన్మించేది మరణించేది ఏది. ఏ చైతన్యమీ ఉపాధి నభిమానించి ఇదే నా స్వరూప మనుకొంటున్నడో – ఆ శరీరమనే ఉపాధికీ జనన మరణాలు. శరీరి అయిన ఆత్మకు కావు. అయినా అదే నేనని భావించిన నేరానికి దానితోపాటు జన్మిస్తూ దానితో పాటు మరణిస్తున్నది. చైతన్యముండి కూడా ప్రయోజనం లేదు కాబట్టి అప్పుడిక చేతనమైనా ఒకటే అచేతనమైనా ఒకటే. అన్నీ పుట్టేవే పోయేవే.

ఒక వృక్షమూ దాని ఫలంలాగా నరుడూ జన్మిస్తూ మరణిస్తున్నాడని చెప్పారంటే వృక్షానికి ప్రాణమున్నది. అంతో ఇంతో వాసనా జ్ఞానమైనా ఉన్నది. ఉన్నా దాని ఉపాధితో అది ఏకమై దానితోపాటు జనన మరణాలను భవిస్తున్నది. పోతే ప్రస్తుతమలాంటి ప్రాణశక్తీ జ్ఞాన శక్తీ ఏ మాత్రమూ లేని ఒక అగార మంటే ఒక పెద్ద భవనమున్నది. అది దృఢస్థాణం. దానికి స్తంభాలూ దూలాలూ వాసాలూ – అన్నీ చాలా దృఢంగానే ఉన్నాయి. అయినా అది కేవలమొక అచేతనమైన ఉపాధి. మన శరీరమెంతో వృక్ష శరీరమూ అంతే. అంచేత దానికీ రాకపోకలు తప్పవు. జీర్ణం భూత్వా అవసీదతి. క్రమంగా కొంతకాలానికి జీర్ణించి శిధిలావస్థకు వచ్చి చివరకెప్పుడో కూలిపోతుంది. అలాగే సీదంతి నరాః – భౌతికమైన ఈ శరీరమే తానని అభిమానించే ఈ నరులు కూడా కూలిపోతారు. రాలి పోతారు. కారణం. జరామృత్యువశం గతాః – జర వల్ల కృశిస్తారు. మృత్యువు వల్ల నశిస్తారు. వాటి కధీనమైనప్పు డలాటి దశనే అనుభవించ వలసి వస్తుంది.

మరి ఈ జరామరణాలను తప్పించుకొనే మార్గమే లేదా. ఉంది. అది నరా వశంగతా అనే మాటలలో మహర్షి సూచిస్తూనే ఉన్నాడు. నరుడే దాని వీడు నారాయణుడు కాలేక పోతున్నాడు. కొత్తగా కానక్కరలేదు కూడా. అయ్యే ఉన్నాడిప్పుడూ. నిరాకారమూ వ్యాపకమూ అయిన చైతన్యమిప్పుడూ ఉంది ఈ శరీరంలో. 'అశరీరం శరీరేషు' అని శాస్త్రమే చాటుతున్నది. అది నారాయణుడే. అంటే పంచభూతాల కయనం లేదా అధిష్ఠానం Basis. దానికే ఆకారమూ లేదు వ్యాపారమూ Form or Function లేదు. ఎటు వచ్చీ అదే నా స్వరూపమని గుర్తించలేక ఆ నారాయణుడే నరుడై కూచున్నాడు. కనుక ఒక పండు రాలినట్టు ఒక భవనం కూలినట్టు ఈ శరీరం కృశించి నశిస్తుంటే దీనితోపాటు తానూ నశిస్తున్నాడు. అదే శోచనీయం. ఇక్కడ నరత్వమున్నంత వరకది ధార్మికమైన స్థాయి అయితే నారాయణత్వమనేది తాత్త్వికమైన స్థాయి అని అర్థం చేసుకోవాలి భావుకుడు.

**అత్యేతి రజనీ యాతు - సాన ప్రతి నివర్తతే**

**యాత్యేవ యమునా పూర్ణా - సముద్ర ముదకాకులమ్ - 6**

అసలది చేతనమేగాదు. అచేతనమే గాదు. ఏ పదార్థమైనా సరే. కాలాని కధీనమై దాని చెప్పు చేతల్లో ఉండవలసిందే. కలయతీతి కాలః – అన్నింటినీ ఎప్పటికప్పుడు మార్చి పారేసేదేదో అది కాలం. మార్పు చలనాత్మకం. ఒక దశ పోయి మరొక దశ రావటమే చలనం. అదే కాలం. చూడండి అండపిండ బ్రహ్మాండ రూపమైన ఈ విశ్వమంతా ఎప్పుడూ

చలిస్తూనే ఉంటుంది. అణువు మొదలు ప్రతి ఒక్కటీ పరిభ్రమిస్తూనే ఉంది. రూపాంతరం చెందుతూనే ఉంది. అత్యేతి రజనీయాతు – రాత్రి పోయి పగలు పగలు పోయి రాత్రి వస్తున్నాయంటే పోయిన రాత్రి రావటం లేదు. పోయిన పగలు రావటం లేదు. సాన ప్రతినివర్తతే. అది కాదు. మరలా వస్తున్నది. మరేమిటి. ఆ రాత్రిలాంటి మరొక రాత్రి. ఆ పగలు లాంటి మరొక పగలు. ఎప్పటికప్పుడు భవిష్యత్తు వర్తమాన మవుతూ వర్తమానం మరలా భూతంగా మారిపోతున్నది. ఎప్పటికప్పుడు నిత్యనూతన మీ సంసారం. అందుకే సంసారమని పేరు వచ్చిందసలు. సంసరతి అవిచ్ఛేదేన ప్రవర్తతే ఇతి సంసారః – ఎప్పుడూ ఎడతెగక ధారావాహికంగా ప్రసరిస్తూ పోయేదని అర్థం.

ఇలా ఎప్పటికప్పుడు నవనవోన్మేషంగా Ever fresh కనిపించక పోతే ప్రతి ఒక్కటీ అలాగే నిలబడి పోవాలి. భూత భవిష్యత్తులు రెండూ వర్తమానంలో కలిసిపోయి వర్తమానమే ఎప్పుడూ మనకు సాక్షాత్కరిస్తూ ఉండాలి. అప్పుడిక జనన మరణలే లేకుండా పోవలసి వస్తుంది. అవి లేకుంటే మన తాతలూ తండ్రులూ ఎవరేగాని మరణించకుండా మనతోపాటు ఇప్పుడు కూడా బ్రతుకుతూ ఉండాలి. మనమూ ఎప్పుడూ చావకుండా బ్రతికే ఉండాలి. ఇది లోకానుభవానికే సరిపడని వ్యవహారం. అంచేత యాత్యేవ యమునా పూర్ణా సముద్రముద కాకులమ్ ఒక యమున లాంటి నది ఎప్పుడూ ఎలా ప్రవహిస్తూనే పోతుందో – పోయి చివరకు

సముద్రంలో ఎలా కలిసిపోతున్నదో – అలాగే ఈ చెట్లేమిటి చేమలేమిటి భవనాలేమిటి భువనాలేమిటి మానవులేమిటి – సృష్టిలో ప్రతి ఒక్కటీ పుడుతూ గిడుతూ పోవలసిందే తప్పదు.

కనుక తండ్రి దశరథుడు కాలం చేశాడని మనం బాధపడ గూడదు. పడి సుఖం లేదు కూడా. ఎందుకంటే బాధపడి మనమా విగ్రహాన్ని మరలా వెనక్కు తీసుకురాలే మంటాడు రాముడు. ఇది దశరథ రాముడుగా చెప్పిన మాట. పోతే ఆత్మారాముడు చేసే ఉపదేశమేమంటే అది ఈ మాటలలోనే తొంగిచూస్తున్నది. కాలం మనమీద పనిచేస్తున్నంత వరకూ పరిణామం తప్పదు. పరిణామ మున్నదంటే అవి జనన మరణాలే. కాలమంటే చలనమే గనుక చలించని పదార్ధమేదో దాన్ని పట్టుకోవా లెప్పటికైనా మానవుడు. చలించనిది నిరాకారమైన ఆత్మచైతన్యమొక్కటే. అది కాలాధీనం కాదు. మీదు మిక్కిలి కాలమే దాని కధీనం. కాలాతీతమది. కాలకాలం. మహాకాలం. అలాంటిది మృత్యుంజయం. ఎక్కడో లేదది. ఏదోగాదు. నీవే నీ చైతన్యమే. అది నీ స్వరూపమే. నీ ఆత్మే. దాన్ని కాకుండా దాని ఉపాధి అయిన మనః ప్రాణ శరీరాదులను పట్టుకొని అవే నేనని వాటితో మమేకమై మానసికంగా దానికి దూరమయ్యావు. అదే అవిద్య. అజ్ఞానం. మరలా అదే గదా నేను ఇది కాదనే ప్రత్యభిజ్ఞ Recognition నందుకో కలిగావంటే చాలు. సిద్ధంగా ఉన్నది నీ ఆత్మ స్వరూపం నీకు. చేయి వేస్తే అందుతుంది. అప్పుడు నీవీ ప్రతిక్షణ పరిణామి అయిన జీవుడవు కావు. కూటస్థుడైన పరమాత్మవే సుమా అని ఆత్మారాముడు మనకిచ్చే హామీ.

**అహోరాత్రాణి గచ్ఛంతి - సర్వేషాం ప్రాణినా మిహా**

**ఆయూంషి క్షపయంత్యాశు - గ్రీష్మే జల మివాంశవః - 7**

కాని ఆత్మారామ స్థితిని మనం గుర్తించనంత వరకూ ఈ కాలగతి మనందరి మీదా పనిచేస్తూనే ఉంటుంది. దాని ధాటీ మన మనుభవించక తప్పదు. అర్ధకామాలేమిటి ఆముష్మికమైన ధర్మమేమిటి. అవి మూడూ దీని రాజ్యంలోనివే. నిరంకుశమైన దాని పాలనకు తల ఒగ్గవలసిందే. తప్పదు. అహోరాత్రాణి గచ్ఛంతి – అహోరాత్రాల రూపంలో నడుస్తూ ఉంటుంది కాలమనేది. సర్వేషాం ప్రాణినామిహ – అది ఈ లోకంలో బ్రతికే ప్రతి జీవికీ అనుభవగోచరమే. పగలు పనులు చేసుకొంటూనే ఉంటాము. రాత్రులు పడుకొని నిద్రపోతుంటాము. ఇది ప్రతిదినమూ అనుభవిస్తూనే ఉన్నాము. దీనికి భిన్నంగా ఎంత పామరుడైనా ఎంత మేధావంతుడైనా ఎవడు గాని జీవిస్తున్నాడేమో చెప్పు చూతాము. ఆ బాల గోపాలమూ ప్రతి ఒక్కడూ రాత్రులు నిద్రలో మునిగిపోవలసిందే. పగలు మేలుకొని లేచి ఆ పనీ ఈ పనీ చేస్తూ పోవలసిందే.

అహోరాత్రాలు గడుస్తూ పోయే కొద్దీ వాటి ఆజ్ఞకు లోబడి నిద్రా జాగ్రత్తులు కూడా మనకు నడుస్తూ పోక తప్పటం లేదు. అంత మాత్రమే గాదు. అలా గడుస్తూ గడుస్తూ కాలం మనకు తెలియకుండా చాప క్రింద నీళ్లలాగా ఒక ఉపద్రవం తెచ్చి నెత్తిన పడేస్తున్నది. ఆయూంషి క్షపయంత్యాశు ఉన్నట్టు మన ఆయుర్దాయాన్నే హరిస్తున్నది. ఎప్పుడు గుండె ఆగి చస్తామో

తెలియదు. వయసుతో నిమిత్తం లేదు. ఆరోగ్యంతోనూ నిమిత్తం లేదు. చిన్న వయసులోనే పోవచ్చు. ఆరోగ్యంగా ఉన్నవాడూ పోవచ్చు. ఆ మాటకు వస్తే ముసలివాడే దగ్గుతూ తుమ్ముతూ అలాగే బ్రతుకుతూ ఉంటాడు. ఆరోగ్యవంతుడే ఉన్నట్టుండి టుప్పుమని ఎగిరి పోతాడు. చూస్తూనే ఉన్నామిలాటి వింతలూ విడ్డూరాలూ మన దైనందిన జీవితంలో.

అంచేత కాలం మనలను బ్రతికిస్తే బ్రతుకుతున్నాము. చంపితే చస్తున్నాము. దానికే ప్రారబ్ధమనీ ప్రాప్తమనీ యోగమనీ అదృష్టమనీ గ్రహచారమనీ తొంభయ్యారు పేర్లు పెట్టి వ్యవహరిస్తున్నాము. పేరులో ఏముంది. మొత్తానికి రాకపోకలు తప్పటం లేదు ప్రాణులకు. బ్రతికిన ఈ నాలుగురోజులైనా నమ్మటానికి లేదు. గ్రీష్మేజల మివాంశవః అంటున్నాడు రామచంద్రుడు. మండువేసవిలో సూర్యకిరణా లెక్కడెక్కడి నీళ్లనూ ఎలా పీల్చి పారేస్తాయో అలా మన ఆయుస్సును పీల్చేస్తున్నది కాలమనే పిశాచి. ఇది ఒక తాటకలాంటిది. ఒక మాయలేడి లాంటిది కాలం. దీన్ని రూపు మాపాలంటే రామబాణంలాంటి బ్రహ్మాకార వృత్తి ఒకటి తప్ప విడిచి మరేదీ పనికిరాదు. ఇంత భయంకరంగా దీన్ని వర్ణించారంటే ఇలా భయపడి చస్తూ పొండని గాదు. ఇది ఇంత భయంకరం గనుకనే అభయమైన ఆత్మ తత్త్వాన్ని పట్టుకొని ఆ బ్రహ్మాస్త్ర బలంతో దీన్ని మట్టుపెట్టండని మనకు భంగ్యంతరంగా చేస్తున్న ఉపదేశం. సరిగా ఇది 'మామేవయే ప్రపద్యంతే మాయా మేతాం తరంతితే' అనే కృష్ణగీతా శ్లోకానికి మార్గదర్శక మీ రామాగీతా శ్లోకం.

**ఆత్మాన మనుశోచ త్వం - కిమన్య మను శోచసి**

**ఆయుస్తే హీయతే యస్య - స్థిత స్యచ గతస్య చ - 8**

ఇంతవరకూ దానిమీదా దీనిమీదా నెపం పెట్టి మభ్యపెడుతూ వచ్చి అసలు రహస్యాన్ని ఇప్పుడీ శ్లోకంలో బట్టబయలు చేస్తున్నాడు రామస్వామి. ఇక్కడ కూడా పైకిచూస్తే సామాన్యంగా చెబుతున్నట్టే కనిపిస్తుంది పరమాత్మ. అది ఎలాగంటే ఆత్మాన మనుశోచత్వం – నీ సంగతి నీవు చూచుకో భరతా – కిమన్య మను శోచసి అన్యులను గురించి ఎందుకాలోచిస్తావు. ఆరాటపడతావు. ఎవరా అన్యులిక్కడ. దశరథుడా. దశరథుడే. ఆయన వారిద్దరికీ తండ్రి. ఆయనే రామ వియోగంతో మరణించాడు హఠాత్తుగా. అది భరించలేకనే భరతు డన్నగారిని మరలా అయోధ్యకు తీసుకెళ్లాలని అరణ్యానికి వచ్చాడు. సాక్షాత్తూ తండ్రి గనుక అతడు విలపించటం సహజమే.

కాని ఎంత తండ్రి అయినా ఆయనా ఒక జీవుడే. అలాటి జీవులమే నీవూ నేనూ కూడా. ఆయన మరణించాడంటే మనం మాత్రం రేపు మరణించమా. జీవులన్నప్పుడందరూ జీవులే. జీవించినంత కాలం జీవిస్తారు. కాలం తీరితే మరణిస్తారు. అలాంటప్పుడెవరికి వారే యమునా తీరే. ఒకరి కొకరన్యులే గదా. తండ్రి అయినా అన్యుడే. తనయుడైనా అన్యుడే. తండ్రి తనయుడని మనమొకరి మీద ఒకరికున్న అభిమానం కొద్దీ పెట్టుకొన్న పేర్లు. అసలు విషయమాలోచిస్తే తండ్రేమిటి తనయు డేమిటి. అందరూ జీవులే. జీవులన్నప్పు డందరికీ రాకపోకలు తప్పవు. అలాంటప్పుడొకరు పోయారే అని మరొకరు బాధపడట మేమిటి.

పడితే ఎవణ్ణి చూచి వాడే బాధపడాలి. అయ్యో ఎంత బతుకు బతికినా ఎప్పుడో ఒకప్పుడు నేనూ పోవలసిందేనే నా తండ్రులూ తాతలూ పోయారు గదా నేను మాత్రమెంత కాలముంటాను. పోక తప్పదే. ఎలాగబ్బా తప్పించు కోటమని ఎప్పుడూ నిన్ను గురించి నీవీ ఆలోచించుకోవాలి. అలాకాక రోలు పోయి మద్దెలతో మొరపెట్టినట్టు ఇతరుల రాకపోకలను గూర్చి ఆరాడపడి ఏమి సుఖం. ఆరుస్తావా తీరుస్తారా. ఆర్చే తీర్చేలాగా అయితే వారూ నీవూ ఎవరూ చావగూడదు మరి. అలాటి భాగ్యమెప్పుడబ్బా ఈ జీవులకు. ఆయుస్తే హీయతే యస్య బ్రతుకుతున్నారని పేరేగాని నీవీ బ్రతుకుతున్న కాలమంతా ఏ క్షణాని కాక్షణం తగ్గిపోతూనే ఉంది – క్షీణిస్తూనే ఉంది – నశిస్తూనే ఉంది. చివరకు అంత్యకాలం దగ్గరపడితే ఈ లోకానికే వీడ్కోలు చెప్పక తప్పదు. స్థితస్యచ గతస్యచ నీవొక చోట నిలదొక్కుకొని అక్కడే కూచున్నా పోక తప్పదు. అలాగే యాత్రలూ జాతలరని చెప్పి దేశ దేశాలూ తిరుగుతున్నా తప్పదు. నిలుచున్నా కూచున్నా తిరుగుతున్నా తిరగకున్నా సమయం వస్తే మూటా ముల్లే సర్దుకొని బయలుదేర వలసిందే.

ఇది వ్యావహారికమైతే ఇక పారమార్థికంగా మనం చెప్పుకోవలసిన భావమేమంటే నీకు మృత్యువు ఒక గడువు పెట్టింది. ఇంతకాలం నీకు వ్యవధి ఇచ్చాను అంతవరకూ నీవు బ్రతుకుతూ పో. కాని ఈ బ్రతుకెందుకో దీని ప్రయోజన మేమిటో అది గుర్తించి దానికి తగిన కృషి చేసి తరించమని మౌనంగా నిన్ను హెచ్చరిస్తున్నది. అదేదోగాదు ఆత్మాన మనుశోచ నీ

అసలైన ఆత్మ స్వరూపమేదో దాన్ని పట్టుకొని యావజ్జీవమూ దాని ఆలోచన పెట్టుకో. అదే నిన్ను మృత్యుముఖంలో పడకుండా తప్పిస్తుంది. అలాటి ఆత్మాకార వృత్తి వదిలేసి కిమన్యమను శోచసి అనవసరంగా ఎందుకీ అన్యమైన చింత నీకు. అదేమి నిన్నుద్ధరిస్తుందా పెడుతుందా. హరిస్తుంది నీ జీవితాన్ని అప్పుడు నీవెక్కడ ఉన్నా పోయేవాడివే. ఏమి చేస్తున్నా పోయేవాడివే. ఆత్మ ఒక్కటే ఎప్పటికీ ఉండేది. అది నీ స్వరూపమని గుర్తిస్తే ఎప్పటికీ పోవు నీవు. కూటస్థంగా నిలిచి ఉంటావని గొప్ప ఆధ్యాత్మికమైన సందేశ మిందులో ధ్వనిస్తున్నది. ఎటు వచ్చీ దీనిమీద విరక్తి చెంది దాని నభ్యసిస్తూ పోవాలి. అదీ మనం చేయవలసిన ఏకైక సాధన. చూడబోతే ఇది కూడా ఉద్ధరే దాత్మనాత్మాన' మనే గీతా శ్లోకానికి మార్గదర్శి అని తోస్తున్నది.

**సహైవ మృత్యుర్వ్రజతి - సహ మృత్యుర్నిషీదతి**

**గత్వా సుదూర మధ్వానం - సహ మృత్యుర్నివర్తతే - 9**

అసలు మృత్యువెప్పుడో అవసానంలో సంప్రాప్త మవుతుంది. అంతవరకు మనం బ్రతుకుతూ ఉంటాము గదా అని గాదు మనం భావించ వలసింది. అది కేవలమొక అపోహ ఎప్పుడూ అది వెంటాడుతూనే ఉంది మనలను. మృత్యుముఖంలోనే ఉన్నాడు మానవుడెప్పుడూ. ప్రతిక్షణమూ జీవిత మనుకొంటే జీవితం మరణమంటే  మరణం. మరణం ప్రకృతి శ్శరీరిణాం వికృతి ర్జీవిత ముచ్యతే అన్నాడు మహాకవి కాళిదాసు. మరణమే

సహజం. బ్రతకటమే అసహజం. జీవితమంతా వ్యాపించి ఉంది మరణ మనేది. అలా కాకుంటే పురిటిలో పోతున్నాడొకడు. బాల్యంలో పోతుంటారు. యౌవనంలో పోతారు. వార్ధక్యంలోనూ పోతారు. ఎప్పుడు ప్రారబ్ధం తీరితే అప్పుడే పోతారు. అది ఎప్పుడో ఎవరికి తెలుసు.

కనుక సహైవ మృత్యుర్వ్రజతి – ఎక్కడికైనా మనం నడచిపోతుంటే ఒంటరిగా పోతున్నామనుకో నక్కరలేదు. తోడున్నా రొకరు. అది మృత్యువు. మనతో పాటే వస్తుంటుందది. అదృశ్యరూపంగా. అలాగే సహమృత్యుర్ని షీదతి – వెళ్లి ఎక్కడైనా ఎవరింట్లోనైనా కూచున్నా మనుకోండి. మనతో పాటది మన పక్కనే కూచొని ఉంటుంది. అంతేగాదు గత్వాసుదూర మధ్వానం – ఎంతో దూరం మనమే దేశానికైనా ప్రయాణం చేస్తూ పోతా మనుకోండి. మన పక్క సీటు ఖాళీగా ఉన్నా లేకున్నా అదీ వచ్చి కూచుంటుంది మనతోపాటు. అసలు ఖాళీగా ఉండనే అక్కరలేదు. మనం కూచున్న సీటులోనే తానూ ఆసీనురాలై ఉంటుంది కానరాకుండా. అంతేనా. మరలా మనం తిరిగి స్వదేశానికి వస్తాముగదా. అప్పుడు సహమృత్యు ర్నివర్తతే అప్పుడూ మృత్యువును వెంటబెట్టుకొనే వస్తాము. ధర్మరాజు వెంట కుక్కలాగా అది మనలనెప్పుడూ ఎడబాయదు.

అసలింత ఎందుకండీ. జీవి పుట్టినప్పటి నుంచీ గిట్టి నేల మీద పడేవరకూ ప్రతిక్షణమూ మరణిస్తూనే ఉన్నాడు. మరణమంటే మార్పేగదా. మారనిచక్షణ మేముందో చెప్పండి. మనసులో ఆలోచనలు అనుక్షణమూ

మారుతూనే ఉంటాయి. ఒక ఆలోచన పోయి మరొకటి ఉదయిస్తూ ఉన్నప్పుడది మరణించటమే గదా. అలాగే మాటాడుతుంటే మాట మారుతున్నది. శరీరంతో చేసే చేష్టలూ మారుతున్నాయి. అసలీ శరీరమే మారుతున్న దనుక్షణమూ. జీవాణువులు పాతవి నశిస్తూ కొత్త వేర్పడు తుంటాయని గదా వైద్యశాస్త్రం చెబుతున్నది. బాల్యం పోయి యౌవనం యౌవనం పోయి వార్ధక్యం వస్తున్నాయంటే అది మార్పు గాదా మరణం కాదా.

కాగా అవసానంలో అసలీ శరీరమే నిశ్చేష్టమై పడిపోతున్నది కాబట్టి దాన్ని మరణం మరణమని పేర్కొంటున్నాము. అంతకు ముందరిదంతా కానట్టు. అంతేగాదు. సోమయాజి అయిన వాడు యజ్ఞయాగాది కర్మలు చేసి రేపు స్వర్గానికి  వెళ్తుతాడని సంతోషించినా ఇక్కడ మరణించే గదా అక్కడికి వెళ్లుతున్నాడు. ఈ శరీరం పోయిగదా మరొక భోగ శరీరం వస్తున్నది వాడికి. మరలా కర్మభూమిలో జన్మించవలసి వస్తున్నదా లేదా. జన్మిస్తే మరొక స్థూల శరీరం ధరిస్తుంటాడు. ధరిస్తే మరలా చచ్చేదాకా ఇదే గదా పరస. జాతస్యహి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్యచ అన్నట్టు జన్మమృత్యు పరంపర తప్ప దెవడికైనా. వాడు మామాలు వాడే కావచ్చు. శాస్త్రజ్ఞుడే Scientist కావచ్చు. కర్మిష్ఠుడే కావచ్చు Ritualist జన్మించాడంటే మరణించ వలసిందే తప్పదు.

అయితే మరి దీనికేమిటి పరిహారం. పరిహారమొక్కటే. అది మన వెంటబడుతుంటే మనం దాని వెంట బడాలి. మరణమంటే మారటం. మారటమంటే చలనం గదా. చలించకుండా మారదేదీ. కాబట్టి అది చలిస్తుంటే మనమూ చలిస్తూ కాదు దాన్ని పట్టుకోవలసింది. మన స్వరూప మచలమైన జ్ఞానమే నని గుర్తించి ఆ స్ఫురణతో దాని వెంటబడాలి. వెంటబడట మంటే వ్యాపిస్తూ పోవటం. ప్రతి దశలోనూ చలనాన్ని అచలం వ్యాపించే ఉందసలు. తరంగమెంత దూరం ప్రయాణం చేస్తూ పోయినా అదంతా జల స్వరూపమే గదా. తరంగమని చూస్తే చలనం. జలమని చూస్తే అచలం. అలాగే ప్రతిక్షణమూ ఈ పిండాండమూ బ్రహ్మాండమూ చలిస్తూ ఉంటే ఈ చలనాన్ని సాక్షిగా చూస్తున్న మన చైతన్యమే మాత్రమూ చలించటం లేదు. అంచేత అదే నా స్వరూపమీ శరీర మనః ప్రాణాదులు కావని నమ్మి గట్టిగా దాన్ని పట్టుకోగలిగితే మనం మృత్యుంజయులమే. సందేహం లేదు.

**గాత్రేషు వలయః ప్రాప్తాః - శ్వేతా శ్చైవ శిరోరుహాః**

**జరయా పురుషో జీర్ణః - కిం హిక్కృత్వా ప్రభావయేత్ - 10**

అలాటి అచలమూ కూటస్థమైన నీ స్వరూపాన్ని నీవు గుర్తిస్తే సరిపోయెగాని లేకపోతే ఈ శరీరమనే ఉపాధే నీ స్వరూపమని అపోహ పడ్డ నేరానికి అది ఏ పాటు పడితే ఆ పాటు పడక తప్పదు. గాత్రేషు వళయః ప్రాప్తాః - శరీరమంతా ముడతలు పడిపోతుంది కాలక్రమేణ.

శ్వేతా శ్చైవ శిరోరుహాః – నల్లని వెంట్రుక లున్నట్టుండి తెల్లబడి పోతుంటాయి. జరయా పురుషో జీర్ణః మరి వార్ధక్యం సమీపించే కొద్దీ జీర్ణావస్థకు వస్తుందీ శరీరం. జర అంటేనే అసలు జీర్ణింప జేసేదని అర్థం. 'వ్యాఘ్రీవ తిష్ఠతి జరా పరితర్జయంతీ – ఒక ఈనిన పులిలాగా జర అనేది నిన్నను క్షణమూ బెదిరిస్తూ ఉంటుంది. రోగాశ్చ శత్రవ ఇవ ప్రహరంతి దేహం' అంతేగాదు. ఎన్నో రకరకాల వ్యాధులు నిన్నెప్పుడూ దెబ్బ తీస్తూనే ఉంటాయి. ఆయుః పరి స్రవతి భిన్నఘటా దివాంభః – మరి వాటితో పాటు నీ ఆయుస్సు చూస్తామా ఓటి కుండలో నుంచి నీరు కారిపోతున్నట్టు రోజు రోజుకూ క్షీణించి పోతున్నది – అయినా బుద్ధి రావటం లేదీ మానవుల కంటాడు భర్తృహరి.

మంచిదే. అయితే మరి ఏమి చేసి మనం దీన్ని తప్పించుకోవా లంటారు. కిం హి కృత్వా ప్రభావయేత్తని అడుగుతున్నాడు రామస్వామి భరతుణ్ణి. కాదు. ఆ వేషంలో ఒక సద్గురువు మనబోటి శిష్యులను. ప్రభావయేత్తనే మాటలో ఉన్న దున్నదంతా. మనం బలహీనులమై తల ఒగ్గుతున్నంత వరకూ అది మనమీద దాడి చేస్తూ పోతుంది. ఎప్పుడైతే మనం బలం పుంజుకొని దానిమీద విడుచుకు పడతామో అప్పుడది మనకు దాసోహ మంటుంది. ఇంతకూ దాని ప్రభావం మనమీద నా మన ప్రభావం దానిమీదనా ఆలోచించ పని రాముడి ప్రశ్న. ఏమిటి జవాబు. దాని ప్రభావం పనిచేస్తే అది సమస్యే. పరిష్కారం కాదు. కాబట్టి మన ప్రభావమే దానిమీద

పనిచేయాలి. ఏమిటా ప్రభావమది ఎక్కడ ఉంది. ఎలా సంపాదించాలి. చెబుతూనే ఉన్నా మది ఏదో గాదు ఎక్కడో కాదు. క్రొత్తగా సంపాదించ వలసిందీ గాదు. మన ఆత్మ చైతన్యమే. Self awareness ఎప్పుడూ ఉందది వస్తు సిద్ధంగా సర్వత్రా ఆకాశంలాగా. ఆకాశం మనచుట్టూ ఉన్నా మనలోపలా వెలపలా ఉన్నా మనలో ప్రతి అణువూ వ్యాపించి ఉన్నా మనం దాని స్పృహ లేకుండా ఎలా బ్రతుకుతున్నామో అలాగే ఆ చిదాకాశం Conscious space కూడా మనల నణువణువూ కమ్ముకొని ఉన్నా అందులోనే మనం జీవిస్తున్నా అది మన స్వరూపమే అయినా మనం దాన్ని గుర్తించటం లేదు. మరచిపోయాము. దాని స్పృహ లేదు మనకు. కాని ఆ స్మృతి కలగటాని కెంతో ప్రయత్న మక్కరలేదు. ఎప్పుడు స్మరిస్తే అప్పుడది మనమే. తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర అని గదా కృష్ణగీత. రామగీత కూడా ఇప్పుడదే. ప్రతిక్షణమూ మన అసలు స్వరూపమా చిదాకాశం మనస్మృతి పథంలో ఉంటే చాలు. మనమిక మృత్యుంజయులమే.

**నందం త్యుదిత ఆదిత్యే - నందం త్యస్తమితే రవౌ**

**ఆత్మనో నావబుధ్యంతే - మనుష్యా జీవిత క్షయమ్ - 11**

స్మృతి కోలుపోయావో నీవు బ్రతికి ప్రయోజనం లేదు. స్మృతి తప్పితే అది మృతే. ఒక సూఫీ విద్వాంసుణ్ణి అడిగారట కొందరు. అయ్యా మీకెంత వయస్సని. ఎంతో లేదు నాయనలారా ఏదో రెండు మూడేండ్ల కంటే ఎక్కువ ఉండదన్నాడట ఆయన. అదేమిటండీ గడ్డాలు మీసాలు నరిశాయి

మీకు. శరీరం సడలిపోయింది కూడా. ఇంకా రెండేళ్లు మూడేళ్ళంటారే మిటండీ అని ఆశ్చర్యపోతూ అడిగారట మళ్లీ. దానికాయన ఏమని జవాబిచ్చాడో తెలుసా. అయ్యా వయసంటే జీవిస్తూ ఉన్న కాలం గదా. అల్లా స్వరూపమే నా స్వరూపమని దాని స్పృహలో బ్రతకటమే గదా జీవితం. అదే గదా వయసు. అలాంటి స్ఫురణ నాజీవితంలో కలిగిన క్షణాలన్నీ పోగు చేసుకొంటే రెండు మూడు సంవత్సరా లుంటాయో లేదో. అందుకే నేనలా చెప్పవలసి వచ్చిందని సమాధాన మిచ్చాడు.

అలాగే మనకా ఆత్మస్మృతి ఉన్నప్పుడే అది బ్రతుకు. అది లేని జీవితమంతా మరణమే. ఇది ఎలాటిదంటే దీపమెంత సేపు వెలుగుతూ పోతుందో అంత కాలమూ చీకటి కానరాదు. ఆ వెలుగెంతెంత తగ్గుతూ పోతే అంతంత చీకట్లు కమ్ముకు వస్తుంటాయి. అసలు దీపమే ఆరిపోయిందో అక్కడ ఉన్నదంతా ఇక చీకటే. చీకటి లాంటిదే ఈ మృత్యువనేది. దాని చాలీతలే ఈ నామరూప క్రియలన్నీ. ఇదే సంసార బంధం మానవుడికి. ఇప్పుడీ సంసారమనే అంధకారం కూడా పటాపంచెలయి పోవాలంటే స్వరూప భావన అనే దీప ప్రకాశం నిరంతరమూ మన స్మృతి పథంలో నిలిచి ఉండాలి. ఇదే ఆహార శుద్ధౌ సత్త్వశుద్ధిః సత్త్వశుద్ధౌ ధ్రువాస్మృతిః – స్మృతిలంభే సర్వగ్రంధీనాం విప్రమోక్షః అని ఛాందోగ్యం చాటుతున్న గొప్ప సుభాషితం.

మరి అలాటి స్మృతి జీవితంలో ఎంత శీఘ్రంగా అలవరుచుకొంటే అంత మంచిది. అలా కాక బేపరవాగా ఆదమరచి బ్రతుకూ పోయామను కోండి. మనుష్య జన్మ ఎత్తి ప్రయోజనం లేదు. జంతువులూ పక్షులు కూడా బ్రతుకుతూనే ఉన్నాయి మనతోపాటు, మన గొప్పేమిటి. నందం త్యుదిత ఆదిత్యే – అవి సూర్యోదయమైతే లేచి చురుకుగా అటూ ఇటూ తిరుగు తూంటాయి. ఆహారం కోసం ప్రాకులాడుతుంటాయి. మనం చేస్తున్నదీ అదే నందం త్యస్తమితే రవౌ – అలా తిరిగి తిరిగి అలసిపోయి మరలా సూర్యుడెప్పు డస్తమిస్తే అప్పుడు వాటి వాటి నెలవులు చేరి హాయిగా పడుకొని నిద్రపోతుంటాయి. అదే పని మనమూ చేస్తుంటాము ప్రతి రాత్రి కాలమూ.

అంతేగాని ఆత్మనో నావబుధ్యంతే మనుష్యా జీవిత క్షయమ్ – రోజు రోజుకూ తమ జీవితకాలమెలా ఖర్చయి పోతున్నదో అవీ గమనించటం లేదు. మనుష్యులమై పుట్టి మనమూ గుర్తించటం లేదు. వాటికంటే వాసనాజ్ఞానమే Instinct గాని వివేచనా జ్ఞానం Reason or Discrimination లేదు. మానవలుమైన మనకేమి రోగం. మనకు వాసనే గాక వివేచనా జ్ఞానం కూడా ఉంది గదా. కనుకనే గదా పురుష మనుష్య అనే పేరు వచ్చింది మనకు. అలాంటప్పుడేది సత్యమో ఏది దాని ఆభాసో విభజించి తెలుసుకొని సత్యాభిముఖంగా పయనించ వచ్చుగదా. సత్యమేవ జయతే అన్నట్టు సత్యమే ఎప్పటికైనా కాపాడుతుంది మనలను. సత్తన్నా సత్యమన్నా ఎప్పటికీ నిలిచి ఉండేదని గదా అర్థం. ఎప్పటికీ ఉన్నదంటే

దానికి మరణం లేదని గదా. అది అసద్రూపమైన ఈ నామరూప ప్రపంచాని కంతా సాక్షిభూతమైన ఆత్మ చైతన్యమేనని గదా శాస్త్రం ఘోషిస్తున్నది. అది కూడా ఏదోగాదు మన స్వరూపమే ఆయె. అలాంటప్పుడు బుద్ధి జీవులైన మానవులది గుర్తించి తరించాలిగాని పశుపక్ష్యాదులలాగా కాల ప్రవాహంలో పడిపోయి ఏమి సుఖం.

**హృష్యం తృతుముఖం దృష్ట్వా - నవం నవ మిహాగతం**

**ఋతూనాం పరివర్తేన - ప్రాణినాం ప్రాణ సంక్షయః - 12**

అయినా బుద్ధి లేదీ మానవులకు. బుద్ధి ఉండి కూడా బుద్ధిహీనులే. కళ్లున్నా చూపులేని వాడెలా గుడ్డివాడో అలాగే బుద్ధి అనే పదార్థముండి కూడా సరిగా పని చేయకపోతే బుద్ధిహీనుడే మానవుడు. అదేమంటే జంతువుల లాగే వీడూ ఏ ఋతువు కాఋతువు వస్తూ పోతుంటే మురిసిపోతుంటాడు. హృష్యంతి ఋతుముఖం దృష్ట్వా. వసంతం పోయి వర్ష ఋతువు వర్షర్తువు పోయి హేమంత ఋతువూ అంటే ఎండలు పోయి వానలు వానలు పోయి చలి కాలమూ – ఎప్పటికప్పుడు పాతదానితో విసుగెత్తిపోయి క్రొత్తది కావాలని కోరుకొంటుంటాడు. నవం నవ మిహా గతమంటే అదే అర్థం. ప్రాతొక రోత క్రొత్తొక వింత అన్నారు. అది జంతువుల కెలాగో మనషులకూ అలాగే ఉత్సాహదాయకం. నవ నవోన్మేషంగా మారి కనపడాలి ప్రకృతి.

పారమేశ్వరమైన శక్తే గదా ప్రకృతి అంటే. ఈశ్వరుడికి లేని సౌందర్యం పరాశక్తికుంది. ఆయన సత్యస్వరూపుడైతే ఆయన మాయాశక్తి సౌందర్య రూపిణి. త్రిపుర సుందరి అని గదా పేరు. క్షణే క్షణే యన్నవతా ముపైతి– తదేవ రూపం రమణీయ తాయాః అన్నాడు మాఘుడు, ప్రతి క్షణమూ క్రొత్తగా కనపడే దేదో అదే సౌందర్యమంటే. శక్తికే ఉంది అలాటి శక్తి. నిర్వికల్పమైన పరమాత్మ చైతన్యాన్ని సవికల్పంగా చూపగలదది. నిర్వికల్పంగా ఉంటే అందం లేదు. సవికల్పంగా మారితేనే అందచందాలు, మాయాకల్పిత దేశ కాలకలనా వైచిత్ర్య చిత్రీకృతమైతేనే అది నవనవంగా క్షణక్షణ రమణీయంగా కనిపిస్తూ మనసు నాకర్షిస్తుంది. వివేచనా రహితుడైతే మానవుడలాటి ఆకర్షణకు లోనయి తన కర్తవ్యాన్నే మరచిపోతాడు.

దేశకాల వైచిత్ర్యాన్ని చూచి మురిసి పోతుంటాడే గాని అది తన కొంప ముంచుతుం దెప్పటికైనా అనే సత్యాన్ని గుర్తించటం లేదు మానవుడు. ‘ఋతూనాం పరివర్తేన ప్రాణి నాం ప్రాణ సంక్షయః – గుర్తించక పోతే నష్టమేమి టంటారా ఎంత నష్టమో చెప్పలే మంటున్నాడు. ఏమిటది. ఒక ఋతువు పోయి మరొకటి వస్తున్నదంటే ఏమిటర్థం. కాలం కదలిపోతున్నదని గదా. కాలం ముందుకు పోయే కొద్దీ ప్రాణినాం ప్రాణ సంక్షయః – ప్రాణుల ప్రాణం కూడా దానితోపాటు గడచిపోక తప్పదు. ప్రాణమంటే క్రియాశక్తి అయిన కాలమే గదా. అప్పటికి కాలం పోతున్నదంటే అర్థం ప్రాణం పోతున్నదనే.

పరివర్తమని రామబ్రహ్మ మన్నాడంటే అది ఎంతో సాభిప్రాయమా మాట. పరివర్తమంటే పరిణామం. మార్పు, మార్పే మరణమని ఇంతకు ముందే చెప్పుకొన్నాము. వాల్మీకి మహర్షి నోట వచ్చిన ఈ పరివర్తమనే మాటే మహాభారత కర్త వ్యాస భట్టారకుని నోట కూడా వచ్చింది. యక్ష ప్రశ్నలలో ఒకచోట యక్షుడు లోకంలో వార్త ఏమిటని అడిగితే ధర్మరాజిలా అంటాడు.

అస్మిన్ మహామోహమయే కటాహే
సూర్యాగ్నినా నిత్య సమేధితేన
మాసర్తుదర్వీ పరివర్తనేన
భూతాని కాలః పచతీతి వార్తా

సంసారమనేది ఒక పెద్ద రాగి కాగనుకొంటే దానికి సూర్య మండలమనే అగ్నిజ్వాల నిత్యమూ క్రింద మండుతుంటే అందులో ఈ ప్రాణులందరినీ పడేసి కాలమనే ఒక పెద్ద వంటవాడు మాసఋతు అయయనాదికమనే ఒక పెద్ద తెడ్డు గరిటె పెట్టి ఆ ప్రాణుల నటూ ఇటూ కలియబెడుతూ పాకం చేస్తున్నాడట. ఇదే వార్త ఇంతకన్నా గొప్ప వార్త ఏమున్నదని జవాబిస్తాడు.

**యధాకాష్ఠంచ కాష్ఠంచ - సమేయాతాం మహార్ణవే**
**సమేత్యచ వ్యపేయాతాం - కాల మాసాద్యకంచన - 13**

**ఏవం భార్యాశ్చ పుత్రాశ్చ - జ్ఞాతయశ్చ ధనాని చ**

**సమేత్య వ్యవధావంతి - ధ్రువో హ్యేషాం వినాభవః - 14**

అసలు కాలప్రవాహంలో అందరమూ కొట్టుకొని పోతున్నప్పుడెవరి కెవరు. కాతే కాంతా కస్తే పుత్ర అన్నట్టు ఎవరికి వారే. ఒంటిగా వచ్చాడు. మానవుడొంటిగా వెళ్లిపోతున్నాడు. ఎక్కడి నుంచి వచ్చాడో తెలియదు. ఎక్కడికి వెళ్లుతున్నాడో అదీ తెలియదు. మధ్యలో ఒకరినొకరం కలుసుకొని వీళ్లు నావాళ్లు వీళ్లను విడిచి ఉండలేమని పిచ్చి అభిమానం పెంచుకొని బ్రతుకుతుంటాము. ఉన్నట్టుండి విడిపోతే విస్తుపోయి చూస్తుంటాము. కొన్నాళ్లు బాధపడతాము. చేసేది లేక మనకు మనమే సమాధానం చెప్పుకొని మరలా దాని ఊసే ఎత్తక మనపాటికి మనం బ్రతుకుతుంటాము. చివరకు మనమూ కాలం దీరిపోతే మనలాగే ఇతరులూ అలాగే భావించి వారి బ్రతుకు వారు బ్రతుకుతుంటారు.

ఇదంతా కాలప్రభావమే గాని మరేదీ గాదు. యధాకాష్ఠంచ కాష్ఠంచ సమేయాతాం మహార్ణవే ఒక మహాసముద్రంలో అటునుంచి ఒకటి ఇటునుంచి ఒకటి రెండు కొయ్యపలకు లెక్కడి నుంచో కొట్టుకు వస్తాయి. వచ్చి ఒకదానితో ఒకటి కలుసుకుంటాయి. కలుసుకొని అలాగే ఉంటాయా. ఉండవు. ఉన్నా ఒక క్షణకాలమే. మరుక్షణం విడిపోయి ఆ తరంగ వేగాని కెక్కడ పోతాయో ఏమయిపోతాయో చెప్పలేము. ఆ కలుసుకోట మేమిటో ఈ విడిపోవట మేమిటో. అంతా దైవఘటన. అవి బుద్ధిపూర్వకంగా వచ్చి

కలిశాయా. మరలా బుద్ధి పూర్వంగా తొలగిపోయాయా. కాలమాసాద్య కంచన ఏదో కొన్ని క్షణాలలా కలుసుకోవలసి కలిశాయి. తొలగవలసి తొలగాయి. అంత మాత్రమే.

అలాగే భార్యాశ్చ పుత్త్రాశ్చ – జ్ఞాతయశ్చ ధనానిచ – మన భార్యాపుత్త్రు లేమిటి – చుట్టపక్కా లేమిటి – ఆఖరుకు ధనధాన్యాలూ వస్తువాహనాలూ ఇలాటి జడపదార్థా లేమిటి – ఏది ఎప్పుడు మనకు ప్రాప్తించాలో అది దగ్గర చేరుతున్నది. ప్రాప్తం కాదో మరలా ఎవరో మెడబట్టి తోసినట్టు దూరమైపో తుంటుంది. సమేత్య వ్యవధావంతి. దగ్గర ఉంటే పొంగి పోతాము. దూరమైతే కుంగిపోతాము. పొంగినా కుంగినా అది మనకేర్పడే అనుభవమే. దానికెలాటి భావమూ లేదు. ధ్రువో హ్యేషాం వినాభవః – అది మనతోనే ఉన్నట్టు ఎంత కనిపించినా మనకనిపించినా ఎప్పుడో ఒకప్పుడు చెప్పకుండా మనలను విడిచిపోయే బాపతే. మనకేగాని బాధ మనదనుకొన్న దాని కే బాధా లేదు. నిర్మొహమాటంగా మనకు దూరమై పోతుంది. అలా దూరమైపోయేది మనదెలా అవుతుంది.

భర్తృహరి శ్లోకమొకటి గుర్తు వస్తున్నదీ సందర్భంలో. యత్రానేకే క్వచిదపి గృహే తత్రతిష్ఠ త్యథైకః – ఒక ఇంట్లో ఎంతో మందున్నారు కుటుంబ సభ్యులు. క్రమంగా అందరూ పోయి ఒక్కడు మిగులుతాడు. 'యత్రాప్యేకస్తదను బహవ స్తత్ర నైకోపిచాంతే – మరొక ఇంట్లో ఒకడు నివసిస్తుంటాడు బ్రహ్మచారి. వాడు పెండ్లి చేసుకొని పిల్లలను గంటే

పదిమంది తయారవుతారు. కాలం దీరి అందరూ పోతే ఎవడూ లేక ఆ ఇల్లు పాడుబడుతుంది. ఇత్థం చేమేరజని దివసౌ దోలయన్ ద్వావివాక్షౌ- కాలః కల్యోభువనఫలకే క్రీడతి ప్రాణిశారైః - ఈవిధంగా కాలమనే ఒక పెద్ద జూదగాడు భువనమనే పలకమీద ఆడుతున్నాడొక జూదం. జత జూదగాడు లేడువాడికి. వాడొకడే ఆడేవాడు. ఆడటానికి పాచికలూ కాయలూ ఉండాలి గదా అంటే ఉన్నాయి. పాచికలు పగలూ రాత్రి అనేవి రెండే. పందెం వేస్తుంటే ఒకదాని మీదినుంచి ఒకటి దొర్లి పడుతుంటాయి. పడే కొద్దీ కాయలు గళ్లలో నుంచి బయటికి జరుగుతుంటాయి. ఆ గళ్లేమిటి. ఆ కాయలేమిటి. గళ్లు మన ఇళ్లు. కాయలు మన తలకాయలు. అంటే మనం. ఎంత మహోన్నతమైన భావమో ఇది ప్రపంచంలోని మేధావంతులంతా పాదాభివందనం చేయాలి ఆ మహాత్ముడికి.

**నాత్ర కశ్చి దృథా భావం - ప్రాణీ సమభివర్తతే**

**తేన తస్మిన్న సామర్థ్యం - ప్రేతస్యాస్త్యనుశోచతః - 15**

కాబట్టి ఇంతకూ ఏమిటి సారాంశం. ఈ ప్రపంచంలో ఏ ఒక్కటీ అది జంగమమే గాదు. స్థావరమే గాదు. ఎప్పటికీ అలాగే నిలిచి ఉండదు. ఎప్పటికప్పుడు మారవలసిందే. మారిందంటే మరణించ వలసిందే. చేతనాలైన మనబోటి జీవులైతే మరణిస్తాయని చెప్పవచ్చు. అది మనం చూస్తూనే ఉన్నాము. మరి అచేతనాలైన అరణ్య నదీ సముద్ర పర్వత సూర్యచంద్ర గ్రహ నక్షత్రాది గోళాలున్నాయి గదా. మనం పోయినా అవి

పోవటం లేదెక్కడికీ, అలాంటప్పుడన్నీ మారిపోతాయని మరణిస్తాయని ఎలా సిద్ధాంతం చేయగలరని ప్రశ్న వస్తుంది. అచేతనమైన జగత్తుందని చెప్పటానికి ప్రమాణమేమిటని అడిగారు వేదాంతులు. ఒకటి ఉందని దాని అస్తిత్వానికి గాని లేదని దాని నాస్తిత్వానికిగాని ప్రమాణమొకటి Evidence ఉంది తీరాలి. ప్రమాణం లేకుండా ప్రమేయానికి Object సిద్ధి లేదు. ఇప్పుడు నీవూ నేనూ ఉన్నామంటే ఉన్నామని మనలో ఒక జ్ఞానం ఉన్నట్టు స్ఫురిస్తుంటే ఉంటున్నాము. ఆ స్ఫురణ Awareness లేకుంటే ఉన్నామో లేమో మనకే తెలియదు. ఉన్నామని చెప్పినా చెల్లదు. లేమని చెప్పినా చెల్లదు. అలాగే మనకు కనిపించే ఈ జడప్రపంచం కూడా. అది జడం కనుక దానికున్నాననే స్ఫురణ స్వయంగా లేదు. స్వయంగా ఉన్నది నీకూ నాకూ. కనుక మనకున్న ఈ స్ఫురణ అక్కడ కూడా ప్రతిఫలించి అది ఉన్నట్టు స్ఫురిస్తున్నది. అప్పుడిదే దానికి ప్రమాణ మవుతున్నది.

అదేమిటి. నా నీ స్ఫురణ దానిమీద పనిచేయుట మేమిటి. నేనూ నీవూ ఎంత కాలముంటా మీ ప్రపంచంలో. ఎప్పుడో కన్ను మూయ వలసిందేగదా. అలా ఈ మానవజాతంతా జంతుజాలంతో బాటు చేతన పదార్థమనేది లేకుండా అందరూ కన్ను మూశా రనుకోండి. అప్పుడీ జడప్రపంచం లేకుండా పోతుందా అని అడుగుతావేమో. అప్పుడూ ఉంటుందొక చైతన్యం. అదే సమష్టి రూపమైన ఈశ్వర చైతన్యం Universal Conciousness. మనది వ్యష్టి చైతన్యమైతే అది సమష్టి. సమష్టి గనుకనే

అది ఈ వ్యష్టి పనిచేస్తు న్నప్పుడూ ఉంది. చేయకుండా తొలగిపోయి నప్పుడూ ఉంటుంది. అది ఉందని ఏమి నమ్మకమంటావా. అది లేకపోతే ఈ వ్యష్టికీ ఈ వ్యష్టికి కనిపించే ఈ ప్రపంచానికీ అసలే అస్తిత్వం లేదు. స్ఫూర్తి లేదు. ఎంచేత, పరిపూర్ణమైన దుంటేనే పరిమిత మనేది. పరిపూర్ణం గనుక అది పరిమితం మీద ఆధారపడదు. అది నిరపేక్షం Absolute. మరి పరిమితం గనుక ఇది దానిమీద ఆధారపడక తప్పదు. కనుక ఇది సాపేక్షం Relative. ఇదీ పరిష్కారం. అంచేత ఈ విషయంలో ఇక ఎక్కువగా ఆలోచించి బుర్ర చెడగొట్టుకో గూడదు. బుద్ధి చెడటమేగాని సత్యం బయటపడదు.

అందుకే చెబుతున్నా డిప్పుడు భగవానుడు. నాత్రకశ్చి ద్యథా భావం- ప్రాణీ సమభివర్తతే ఈ లోకంలో ఎవడుగానీ ఎంత ప్రజ్ఞా పారంగతుడు గానీ తన బుద్ధిని బట్టి ఏదీ సాధించలేడు. మానవుడి బుద్ధే పరిమితం. ఎంతటి మేధావంతుడిదైనా సరే. అనంతం కాదది. సాంతం Finite అలాంటి బుద్ధి ఏది ఆలోచించినా ఏది కోరినా అది పూర్తిగా ఫలిస్తుందని చెప్పలేము ఎప్పటికీ మరణించగూడదు ఎప్పుడూ బ్రతికే ఉండాలని కోరుకొంటాడు ప్రతివాడూ. కాని బ్రతుకుతున్నాడా. చంద్రమండలానికి వెళ్లి అక్కడేదో ఘనకార్యం చేసి వద్దామనుకొనే వ్యోమగామి అయినా బ్రతకగలడా. వాడూ మరలా ఈ భూమండలానికి రాక తప్పదు. వచ్చి ప్రారబ్ధం తీరితే దీనికి వీడుకోలు చెప్పకా తప్పదు.

తేన తస్మిన్న సామర్థ్యం – ప్రేతస్యా స్త్యనుశోచతః అంచేత ప్రేతస్య చచ్చినవాణ్ణి గూర్చి అనుశోచతః నీవెంత విచారిస్తూ కూచున్నా ప్రయోజనం లేదు. విచారించటం మాత్రమే నీవు చేయగలిగేది. తస్మిన్న సామర్థ్యం – వాణ్ణి మరలా వెనక్కు తీసుకురాలేవు. తీసుకురావాలని నీవెంత ఆశపడ్డా ఆరాటపడ్డా అలాటి సామర్థ్యమే మానవుడికీ లేదు. తస్మా దపరిహార్యే ర్థ్యే–నత్వం శోచితుమర్హసి అని కృష్ణ భగవానుడు కూడా ఇదే గదా సెలవిస్తాడు. ఒకటి పోతున్నదంటే అలా పోయే స్వభావముంటేనే అది పోతుంది. అదేదో గాదు. ఈ శరీరమనే ఉపాధి. నామరూపాత్మకమైన ప్రతి ఒక్కటీ ఉపాధే Medium. దేనికిది ఉపాధి. ఆత్మచైతన్యానికి. నామరూపరహితం కాబట్టి అది ఒక్కటే ఉపాధి కానిది. నిరాకారమైన ఆ చైతన్యానికి సాకారమైన ఈ శరీరాదులన్నీ ఉపాధులే. వ్యష్టి చైతన్యానికీ శరీరమూ సమష్టి చైతన్యానికైతే విశ్వశరీరమూ. ఇప్పుడు మార్పన్నా మరణమన్నా ఈ ద్వివిధమైన శరీరానికే. అశరీరమైన ఆత్మకు కాదు.

కనుక ఇప్పుడు మన సమస్యకు పరిష్కారమేమిటో మనకర్థ మవుతున్నది. అశరీరమైన ఆ చైతన్యమేనా అసలు స్వరూపమని – దానికి కనిపించే ఈ శరీరాద్యుపాధులన్నీ దాని విభూతే దాని విస్తారమే Expansion నని గుర్తించి ఆ భావంలో గట్టిగా నిలబడితే చాలు. దాన్నే జ్ఞానమని జ్ఞాన నిష్ఠ అని పేర్కొంటారు వేదాంతులు. అప్పుడేదీ రావటం లేదు. పోవటం లేదు. స్వరూప విభూతులుగా రెండూ నేననే భావమే ఉన్నప్పుడిక

రాకపోకలనే ప్రసక్తి ఏముంది. ఇదీ ఎప్పటికైనా మానవుడు సాధించవలసిన జీవిత పరమార్థం.

**యథాహి సార్థం గచ్ఛంతం - బ్రూయా త్కశ్చత్పథి స్థితః**

**అహామప్యాగమిష్యామి - పృష్ఠతో భవతామితి - 16**

**ఏవం పూర్వైర్గతో మార్గః - పితృ పైతా మహాధ్రువః**

**తమాపన్నః కథం శోచే - ద్యస్య నాస్తి వ్యతి క్రమః - 17**

అలాంటి స్థాయి నందుకోనంత వరకూ లోకంలో మానవులందరూ అవివేకులే. చదువులేని పామరులేగాదు. పండితమ్మన్యులైన శాస్త్రజ్ఞులూ వైదిక ధర్మ పరాయణులూ సంగీత సాహిత్యాది కళాకారులూ ప్రతి ఒక్కరూ బేవ కూపులే, పీత్వా మోహమయీం ప్రమాద మదిరా మున్మత్త భూతం జగ'త్తన్నాడు భర్తృహరి. ప్రతి ఒక్కడూ బాగా తప్ప తాగి మైకంలో బ్రతుకుతున్న వాడే ప్రపంచంలో. బ్రతుకుతున్నా ఆ బ్రతుకెప్పుడో ఒకప్పు డంతమయ్యేదే కాబట్టి బ్రతికినా చచ్చిన వాళ్లమే మనం. జీవచ్ఛవాలం. ఉమర్ ఖయ్యాము చెప్పినట్టు కొందరు నేల క్రింద ఉన్న శవాలు. కొందరు నేలమీద తిరుగుతున్న శవాలు.

ఈ తిరిగే మనబోటివాళ్ల మెప్పటికైనా ఆ పోయిన వాళ్లను కలుసుకో వలసిందే తప్పదు. ఇది ఎలాటిదంటే యథాహి సార్థం గచ్ఛంతం - సార్థమంటే బాటసారుల గుంపు. బయలుదేరి పోతున్నారు మనకన్నా

ముందుగా మార్గంలో కొందరు. బ్రూయా త్కశ్చిత్పధి స్థితః – మనం కూడా ఆ గుంపులో కలిసిపోవలసిన వాళ్ళమే. వాళ్లు మనకు కనపడకుండా దూరమైపోతుంటే కేక పెడుతుంటాము. ఏమని. అహమప్యాగమిష్యామి నేనూ మీతో వస్తానయ్యా కొంచె మాగండని. పృష్ఠతో భవతామితి – మీరు ముందు పోతుంటే మీ వెనకాలే నేనూ వస్తున్నానని ఎలా ఒక పాంధుడు కేక పెడుతుంటాడో – అలాగే మన పూర్వికులందరూ ఏదో లోకాంతరాలకు వెళ్ళిపోతుంటే కాలందీరి మనమూ వారి వెంటబడి పోతాము. అందరూ పోవలసిన వాళ్లమేగాని ఉండవలసిన వాడెవడూ లేడు.

వింటుంటే ఇది మనకెంతో గాబరాగా ఉంటుంది. ఎప్పుడోగాదిప్పుడే పోతామా ఏమనే నిరాశా భయమూ ఏర్పడుతుంది. కాని ఇందులో ఆంతర్యమేమంటే పోయేదాన్ని పట్టుకొని కూచున్నాము గనుకనే పోతున్నాము. అలా పోకుండా ఎప్పటికీ నిలిచి ఉండేదాన్నే పట్టుకోగలిగితే ఎక్కడికీ పోము. ఎప్పుడూ ఉంటూనే ఉంటాము. ఆ ఉండేదేదో గాదు. విశ్వవ్యాప్తమైన మన ఆత్మ చైతన్యం. అది ఇప్పుడు మన దగ్గరే ఉన్నది. మనమే, అయినా ఆ గొప్ప సత్యాన్ని మనం విస్మరించాము. విస్మరించి యావజ్జీవమూ మనలను గాక మనదాన్ని మనమని భావించి దానితో సతమత మవుతున్నాము. చివరకది కనుమరుగైతే మనమూ దానితో పాటు కన్ను మూస్తున్నాము. అయితే మనది కూడా మన విభూతే నన్నారు గదా. మన విస్తారమే గదా అది. తప్పేమి టంటారా. నిజమే. తప్పు లేదు. నీ

విభూతిగా దాన్ని చూస్తే. అలా చూడాలంటే ముందు నీ స్వరూప మేమిటో గుర్తించి తరువాత ఆ దృష్టితో దాన్ని చూడాలి. అలా చూడనంత వరకూ విభూతి కాదది. నీ పాలిటికి సంసారం. సంసార మెప్పుడయిందో జనన మరణాలు తప్పవు.

**ఏవం పూర్వైర్గతో మార్గః - పితృపైతామహో ధ్రువః**

**తమా పన్నః కథం శోచే - దృస్యనాస్తి వ్యతిక్రమః - 18**

జనన మరణాదులైన ద్వంద్వాలతో కూడిన ఈ సంసారమనేది వ్యావహారిక సత్యం Relative Truth. నేనూ నాది అనే వ్యవహార మున్నంత వరకే ఇది సత్యం. నాది కూడా నాకు పరాయి కాదు నావిభూతే నా స్వరూపమేనని జ్ఞానముదయిస్తే అది ఇక వ్యావహారికం కాదు. పారమార్థికమైన సత్యం. Absolute Truth. అంతవరకూ నీవెంత శోకించినా ప్రయోజనం లేదు. పరమార్థ జ్ఞానం కలగనంత వరకూ ఎంత చింతించి ఏమి సుఖం. నూటికి కోటికే ఒక్కడికో తప్ప నూటికి తొంభయి తొమ్మిది మందికి కలగదా జ్ఞానం కూడా. అలా జ్ఞానం లేకుండా పోయిన వారే ఇంతకు ముందుగా పోయిన మన పితృపితా మహులంతా.

'ఏవం పూర్వైర్గతో మార్గః పితృపైతామహో ధ్రువః – చాలా వరకూ వారంతా కర్మిష్ఠులు. శాస్త్రోక్తమైన ధర్మమార్గంలో కాలం గడపి పోయిన వారే. తమాపన్నః కథంశోచేత్ – అలాటి ధర్మమార్గం కూడా తక్కువది గాదు. ఆత్మలోక ప్రాప్తి లేకపోయినా పుణ్యలోక ప్రాప్తికైనా నోచుకోవచ్చు.

బ్రహ్మసాయుజ్యం కాకపోయినా దేవతా సాయుజ్యమైనా ప్రాప్తించగలదు. అలాంటి మంచి మార్గంలో పయనిస్తున్నావు నీవు భరతా ఎందుకిలా శోకిస్తున్నావు. యస్యనాస్తి వ్యతి క్రమః - శోకించినా కాలగతిని దాటిపోలేము గదా. గడచిపోయిన కాలాన్ని వెనక్కు మళ్లించటం సాధ్యం కానప్పుడెంత వగచి ఏమి సుఖం.

**వయసః పతమానస్య - స్రోతసోవా నివర్తినః**

**ఆత్మాసుఖే నియోక్తవ్యః - సుఖభాజః ప్రజాః స్మృతాః - 19**

కాకపోయినా వయసః పతమానస్య – మానవుడి వయస్సు నిలకడగా ఉండేది కాదు. క్షణ క్షణమూ పడిపోతుంటుంది. ఆయుః పరిస్రవతి భిన్నఘటా దివాంభః - ఓటికుండలో నీరు కారినట్టు కారిపోతున్న దాయుస్సు మానవులకు, అలాంటప్పుడు మన తండ్రులు పోయారే తాతలు పోయారే అని వాపోతావేమిటి. పోక ఏమవుతారు. ఒక మానవుడేమిటి. నిరంతర ప్రవాహశీలమీ ప్రపంచమంతా. స్రోతసోవా అనివర్తినః - ఇంతెందుకు. ఒక నదీ ప్రవాహానికి జవాబు చెప్పు చూతాము. ఏ కొండ శిఖరం మీదనో పడుతుంది వర్షం. అక్కడ నుంచి వర్షం ధారాపాతంగా నేలమీద జాలువారుతుంది. అది అక్కడ నిలవక మరలా అతివేగంగా ప్రయాణం చేస్తూ పోయి చివరకు సముద్రంలో కలుస్తుంది. ఇందులో ఏ ఒక్క దశలో కూడా దానికి ముందు చూపేగాని వెనక్కు తిరిగే ప్రశ్నే లేదు.

కాబట్టి చేతన మచేతనమనే తేడా లేదు. సంసార మన్నప్పుడు ప్రతి ఒక్కటీ ఇందులో ఎడతెగకుండా ముందు ముందుకు సాగిపోయేదే. అంచేత ఇదే నగ్న సత్యమని ఎప్పుడు గుర్తించామో అప్పుడిక ఏడుస్తూ కూచోటం గాదు చేయవలసింది. ఆత్మా సుఖే నియోక్తవ్యః - ఎప్పుడూ సుఖంగా బ్రతికే మార్గమేమిటా అని ఆ మార్గంలోనే మనసు పెట్టి ప్రయత్నం సాగిస్తూ పోవాలి. ఎందుకంటే సుఖభాజః ప్రజాః స్మృతాః - మానవుడై పుట్టిన ప్రతివాడూ సుఖంగా ఉండాలనే ఎప్పుడూ కోరుకొంటాడు గాని కష్టపడాలని కోరడు.

అయితే ఈ సుఖమనేది రెండు విధాలు. ధర్మాచరణవల్ల కలిగేదొకటి. బ్రహ్మజ్ఞానం వల్ల కలిగే దొకటి. మొదటిది తాత్కాలికం. రెండవది శాశ్వతికం. ఇహంలో ఎవడి ధర్మం వాడు నిష్కర్షగా పాటిస్తూ పోతే మరణానంతరం స్వర్గాదులైన ఉత్తమ భోగాలను భవించగలడు. తరువాత ఈ కర్మ భూమి మీద జన్మించినా ఉత్తమ జన్మ ఎత్తి ఉత్తమ సుఖానుభవానికి నోచుకోగలడు. కాని ఇది తాత్కాలికం. పోతే శాశ్వతమైన సుఖమింకొక టున్నది. అది ధర్మం వల్లగాదు. జ్ఞానంవల్ల. నేనూ నేను చూచే ఈ సమస్తమూ నా స్వరూపమేననే ఏకాత్మ భావమే జ్ఞానమంటే. దానికిహమూ లేదు. పరమూ లేదు. ఒక లోకానికి పోవటం లేదు. రావటం లేదు. అసలు జనన మరణాలే లేవు. అంతా అలికేసినట్టు ఆత్మ స్వరూపమే. అది నిరాకారం. సర్వవ్యాపకం కాబట్టి ఎప్పటికీ నిలిచి ఉండే సుఖం. శాశ్వతమైన సుఖం. విజ్ఞానమానందం బ్రహ్మ - నిత్యానంద స్వరూపమది.

S S S S S S S S S S S S S S S S S S S S S S S S

**ఆయురుత్తమ మాసాద్య - భోగా నపిచ రాఘవః**

**సన శోచ్యః పితా తాత - స్వర్గస్సత్కృత స్సతామ్ - 20**

ఇంతకూ మన తండ్రి దశరథ మహారాజు తత్త్వజ్ఞుడు కాకపోయినా ధర్మజ్ఞుడు. ఆయురుత్తమ మాసాద్య ఎంతోకాలం జీవించాడీ లోకంలో. షష్టిర్వర్ష సహస్రాణి – 60వేల ఏండ్లు రాజ్యమే చేశాడు దశరథుడని వాల్మీకి వాచా చెప్పాడంటే అప్పటికి దశరథుడి ఆయుర్దాయమెంతో మన మూహించుకోవచ్చు. సుమారు ఒక లక్ష సంవత్సరాలైనా జీవించి ఉంటాడు. భోగానపిచ రాఘవః – ఎంతకాలం జీవించాడో అంత కాలమూ ఐహిక భోగాలన్నీ నిరాఘాటంగా అనుభవిస్తూ వచ్చాడు. స్వర్గతః సత్కృత స్సతామ్ – మరి కేవలం భోగలాలసమైన జీవితమే గాక జీవితాంతమూ ధర్మమార్గం తప్ప లేదాయన.

క్షత్రియోచితమైన సమస్త ధర్మాలూ శాస్త్రమెలా విధించిందో ఆ విధానం తప్పకుండా ఆచరిస్తూ వచ్చాడు. ధర్మజ్ఞులైన సత్పురుషులందరి ప్రశంసలూ అందుకొని చివరకు దేహత్యాగం చేసి తన ధర్మాచరణకు తగినట్టు స్వర్గలోకమే చేరి స్వర్గ సుఖాలను భవిస్తున్నాడు. సనశోచ్యః పితా తాత నాయనా భరతా అలాటి తండ్రిగారి కోసం నీవుగాని నేనుగాని పరిత పించటం మంచిది కాదు. శోచనీయుడు కాడాయన శ్లాఘనీయుడు. సరిగా ఇది అశోచ్యానన్వ శోచస్త్వమ్మనే గీతా శ్లోకాన్ని తలపిస్తున్నది. నాను శోచంతి పండితాః అని గదా కృష్ణ బ్రహ్మం మాట. రామబ్రహ్మం మాట కూడా అదే.

అయితే అక్కడ మోక్ష పురుషార్ధ ప్రసంగంలో చెబితే కృష్ణుడిక్కడ రాముడు ధర్మపురుషార్ధ ప్రసంగంలో చెబుతున్న మాట. స్వర్గతః పితా అని ఎప్పుడన్నాడో అప్పుడిది ధర్మమేగాని మోక్షం కానేరదు. మోక్షానికి ఇహపరాలు లేవు. అసలు దేశకాల వస్తువులనే మూడు పరిచ్ఛేదాలూ లేవు మోక్షంలో. అంతా కలిసి కేవల మాత్మ చైతన్యమే. పోతే దాని ఆభాసలే ఈ స్వర్గాది లోకాలన్నీ. లేదా దాని విభూతి అని చెప్పినా చెప్పవచ్చు. అంత మాత్రమే.

**సస్వస్థో భవ మా శోచీ - ర్యాత్వా చావసతాంపురీం**

**తథా పిత్రానియుక్తోసి - వశినా వదతాం వర - 21**

చేయవలసిన బోధ అంతా చేసి మరలా కధా భాగమందు కొంటున్నాడు మహర్షి. రాముడిలా తమ్ముడికి బోధ చేసి సోదరా! నీవిక శోకించవద్దు. మాశోచీః – స్వస్థోభవ – స్తిమితంగా ఉండు. యాత్వా చ ఆవస తాం పురీమ్. మరలా అయోధ్యాపురానికి బయలుదేరి పోయి అక్కడే నివసించు. తథా పిత్రా నియుక్తోసి వశినా వదతాంవర అలాగే కదా తండ్రి గారు నిన్ను నియోగించారు అయోధ్యను రాజధాని చేసుకొని రాజ్య పాలన చేయుమని గదా నీకాయన బోధించిన కర్తవ్యం. ఇంత ఉత్తమాభిజనంలో జన్మించి నీ కర్తవ్యమేదో నీవాచరించకపోతే ఏమి బాగు. కనుక నా మాట విని వెంటనే నీవు నీ పరివారంతో అయోధ్యకు ప్రయాణమయి పోవాలి సుమా.

**యత్రాహ మపి తేనైవ - నియుక్తః పుణ్యకర్మణా**

**తత్రైవాహం కరిష్యామి - పితు రార్యస్య శాసనమ్ - 22**

మరి నీ సంగతేమిటి. నాలాగే నీకు కూడా ఆయన తండ్రే గదా. తండ్రి మాట నాలాగా నీవూ పాటించాలిగదా అంటావా. నిజమే. తప్పకుండా పాటిస్తా. యత్రాహ మపితే నైవ నియుక్తః – నన్నెక్కడ ఉండమని ఆయన ఆదేశించాడో తత్రైవాహం కరిష్యామి పితుః శాసనమ్ – అక్కడే ఉండినే నాయన ఆజ్ఞ నెరవేరుస్తా. అంటే ఏమిటింతకూ సారాంశం. భరతుడికి రాజ్యపాలన అప్పజెప్పాడు కాబట్టి అతడదే చేయాలి. పోతే రాముడి కరణ్యవాసం విధించాడు కాబట్టి అతడరణ్యవాసమే చేయాలని భావం.

ఇక్కడికి రామమూర్తి ఉపదేశించిన పూర్వగీత సమాప్తమయింది. రామగీతలో పూర్వగీత ఇది. పోతే ఇక ఉత్తర గీత ప్రారంభమవుతున్నది. మొదటిది రాముడు భరతుడికి చేసిన ఉపదేశమైతే హనుమద్రాము లిద్దరూ కలిసి కిష్కింధలో తార మొదలైన వానరాంగనలకు చేసినదీ రెండవది.

## ఉత్తర గీత

**తతో నిపతితాం తారాం - చ్యుతాం తారామివాంబరాత్**

**శనై రాశ్వాస యామాస - హనుమాన్ హరియూథ పః - 23**

శ్రీరాముడు వాలినొక్క కోలతో కూల నేశాడు. నేలమీద కదలకుండా బల్లపాటుగా పడిపోయాడు వాలి. వానర సైనికులు పోయి వార్త చెబితే వాలి భార్య తార వెంటనే పరుగెత్తి వచ్చి వాలి శరీరం మీద వాలి ఆక్రందన చేయసాగింది. ఆకాశం నుంచి హఠాత్తుగా నేలరాలిన తారలాగా ఉందట తార. అది చూచి రామభక్తుడు హనుమంతుడామె నోదారుస్తూ మొదట కొన్ని మంచి మాటలిలా సెలవిస్తాడు.

**గుణదోషకృతం జంతుః - స్వకర్మ ఫలహేతుకం**

**అవ్యగ్ర స్తదవాప్నోతి - సర్వం ప్రేత్య శుభా శుభమ్ - 24**

అమ్మా ఈ లోకంలో ఎవరెలా నడచుకొన్నా వారు చేసే పనులెలాంటివే గానీ అది మంచో చెడ్డో దాని ఫలమత డనుభవించ వలసిందే తప్పదు. స్వకర్మ ఫలహేతుకం - త్రికరణాలతో మనం చేసే ప్రతి కర్మకూ ఫలితముండి తీరుతుంది. దానికి హేతువా కర్మలోని గుణదోషాలే. అంటే

ధర్మా ధర్మాలే. ధర్మం చేస్తే ధర్మ ఫలం అధర్మం చేస్తే అధర్మ ఫలం. జంతుః – జన్మించిన ప్రతి జీవి పరిస్థితీ ఇంతే, చేసినవాడికి చేసుకొన్నంత మహదేవా అని కర్మఫల మెలాంటిదైనా అనుభవించ వలసిందే. లేకుంటే అకృతా భ్యాగమ కృతవి ప్రణాశాలనే రెండు ప్రశ్నలకు జవాబు చెప్పవలసి ఉంటుంది. చేయనిది వచ్చి నెత్తిన పడితే అకృతాభ్యాగమం. చేసింది మాఫీ అయిపోతే కృత విప్రణాశం. రెండూ అర్థం లేనివే అయిపోతాయి. కనుక ఒక పని చేశామంటే ఫలితముండి తీరవలసిందే. క్రియకు ప్రతిక్రియ అనేది అనివార్యం.

అయితే అది ఎప్పుడు ఎక్కడ ఏ నిమిత్తంగా జరుగుతుం దనేది నీకూ నాకూ తెలిసేది కాదు, మన మల్పజ్ఞులం. ఫలితమనుభవానికి రావటమే మనకు తెలుస్తున్నది. అవ్యగ్ర స్తద వాప్నోతి. అంతవరకూ అనివార్యంగా మనం పొందవలసిందే. కాని అది మరణానికి ముందా ఆ తరువాతా  అదేది మన చేతిలో లేదు. మరణానంతరం జరిగేది జననానికి ముందు జరిగింది అల్పజ్ఞులమైన మనకెలా తెలుస్తుంది. అది తెలిసినవాడు సర్వజ్ఞుడైన ఈశ్వరుడొక్కడే. శుభా శుభం – ఆయనే ప్రాణులకు కలిగే మంచిచెడ్డలు నిర్ణయించగలడు. వాటికి దగిన సుఖదుఃఖాది ఫలమూ అందజేయగలడు.

**శోద్యా శోచసి కంశోచ్యం - దీనాం దీనానుకంపసే**

**కస్యకోవాను శోచ్యోస్తి - దేహేస్మిన్ బుద్భుదోపమే - 25**

కాకపోయినా శోచ్యా శోచసి కం శోచ్యమ్ ఎవరి కోసం నీవు శోకించటం. భర్త కోసమంటావా. మధ్యలో వచ్చిందేగదా భార్యాభర్తృ సంబంధం. అందులో ఎవరు పోయినా ఉన్నవారికి వారితో సంబంధ మక్కడికి తెగిపోయేదే గదా. అతణ్ణి గురించి నీవు శోకిస్తున్నావు సరే శోచ్యా శోచసి కంశోచ్యమ్ రేపు నిన్ను గూర్చి శోకించ వలసిందెవరు. మనం మాత్ర మెంతకాలమీ నేలమీద జీవిస్తాము. ఇవాళ వాలి అయితే రేపు మనం. అందరూ మరణించటం తథ్యమయి నప్పుడెవరిని గూర్చి ఎవరు శోకించా లంటావు. వాడు శోచ్యుడైతే వీడు మాత్రం శోచ్యుడు కాడా.

అలాగే దీనం దీనాను కంపసే నీవు దీనురాలవై ఒకప్రక్క నీ భర్త దీనావస్థలో ఉన్నాడని అతడికి సానుభూతి చూపుతున్నావు. నీవిప్పుడు నీ పెనిమిటికి చూపితే రేపు నీకు చూపవలసిన వారెవరు సానుభూతి. పోయిన ప్రతి ఒక్కరూ శోచనీయులే. ప్రతి ఒక్కరూ దీనులే. దేహేస్మిన్ బుద్బుదోపమే అసలు మనకున్న ఈ శరీరమే బుద్బుదోపమానం. బుద్బుదంలాగే క్షణ భంగురమైనది. అలాంటప్పుడు – కశ్చకస్య అనుశోచ్యోస్తి – ఎవరెవరిని గూర్చి పలవించాలి. ఎవరెవరికి చూపాలి సానుభూతి.

అసలిదంతా ఈ దేహమే నా స్వరూపమని భ్రాంతి పడటం వల్ల ఏర్పడిన ప్రమాదం. భౌతికమైన ఈ ఉపాధి ఎప్పుడూ నిలిచేదిగాదు. ఏదో ప్రారబ్ధమున్నంత వరకే దీని ఉనికి. అది తీరిందంటే ఇది పట్టుకొన్నా నిలవదు. పడిపోతుంది. పంచభూతాలలో కలిసిపోతుంది. అలా పడిపోనిదీ

కలిసిపోనిదీ ఒక్కటే. అది పరిశుద్ధమైన మన చైతన్యం. భౌతికం కాదది అభౌతికం. ఈ రహస్యం పెద్దల వల్ల గ్రహించి అదే మన స్వరూపమని దానితో తాదాత్మ్యం చెందామో అప్పుడు మనమెక్కడికీ పోము. పోకుంటే శోకం లేదు దైన్యం లేదు మనకు.

**జానా స్యనియతా మేవం - భూతానా మాగతిం గతిం**

**తస్మా చ్ఛుభంహి కర్తవ్యం - పండితే నైహ లౌకికమ్ - 26**

అలాటి ఆత్మజ్ఞానం లేనంతవరకూ మనమందరమూ మర్తుల్యమే Mortals. జానాస్యనియతా మేవం భూతానా మాగతిం గతిం – సమస్త భూతాలూ రాకపోకలు చేస్తూ పోవలసిందే. ఇది నీకు తెలియని విషయం కాదు. చూస్తూనే ఉన్నావు నీ జీవితంలో. ఏమీ తెలియని పామరులే గాదు. అన్నీ తెలిసిన పండితులు కూడా. ఆఖరుకు వేదోక్తమైన సత్కర్మ లాచరించే కర్మిష్ఠులు కూడా. వారు స్వర్గాది లోకాలకు వెళ్లినా అక్కడ అన్ని సుఖాలూ అనుభవించినా తిరిగీ ఈ మర్త్యలోకంలో వచ్చి పడవలసిందే. గతా గతం కామ కామా లభంతే అని శాపం పెడుతున్నది శాస్త్రం. కామ్యములైన యజ్ఞయాగాదు లనుష్ఠించిన వారు కూడా అక్కడికీ ఇక్కడికీ నిర్విరామంగా ప్రయాణం చేయవలసిందే తప్పదు.

అంచేత నేనొక మాట చెబుతాను విను. శుభంహి కర్తవ్యం పండితేన ఐహలౌకికమ్. ఇహంలో తెలివిగల వాడెప్పుడే గానీ ఏది తన ఆత్మోద్ధరణకు తోడ్పడుతుందో అలాటి శ్రేయస్సునే అభ్యసించాలిగాని తాత్కాలికమైన

ప్రేయస్సును గాదు. ప్రేయస్సువల్ల కలిగే దుష్పరిణామ మెలాంటిదో నిత్యమూ మనం చూచే పరిస్థితులే మనకు గుర్తు చేస్తున్నాయి. ఇంకా మనం తెలివి తెచ్చుకొని జీవితాలు చక్కదిద్దు కోకపోతే ఎంత వెర్రితనం.

**సంస్కార్యో హరిరాజస్తు - అంగద శ్చాభిషిచ్యతామ్**

**సింహాసన గతం పుత్త్రం - పశ్యం తీ శాంతి మేష్యసి - 27**

అంచేత అంతటి గొప్ప ఆత్మజ్ఞానానికి నీవు నోచుకోక పోయినా ఇహంలో నీవు పాటించవలసిన కర్తవ్యమైనా పాటించు. సంస్కార్యోహరి రాజస్తు వానర రాజైన వాలికి దహన సంస్కారాలు యథావిధిగా చేయించు. అంగదశ్చాభిషిచ్యతాం – నీకుమారు డంగదుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి గావించు, సింహాసన గతం పుత్త్రం పశ్యంతీ శాంతి మేష్యసి – అలా చేస్తే కనీసం సింహాసనాధిష్ఠితుడైన కుమారుణ్ణి చూస్తూనైనా నీకు శోకోప శమనమూ మనశ్శాంతీ లభించగలదు.

అని ఈ విధంగా తన భక్తుడు ఆంజనేయుడు ముక్తసరిగా చేసిన ఉపదేశం విని ఎంతో సంతోషించి భగవానుడైన రామచంద్రుడే ఇప్పుడు మరలా రంగంలో దిగి ఆ రెండింటికీ ముక్తాయింపుగా కొన్ని గొప్ప సుభాషితాలు సెలవిచ్చి భరత వాక్యం పలుకుతున్నాడు.

**న సుగ్రీవంచ తారాంచ - సాంగదాం సహలక్ష్మణః**

**సమానశోకః కాకుత్స్థః సాంత్వయ న్నిద మబ్రవీత్ - 28**

హనుమంతుడి మాట లందరూ విన్నారు. కొంత ఊరట కలిగింది. అది బాగా నిలబడిందో లేదో స్థూణానిఖనన న్యాయంగా మరికొంత దృఢంగా నిలబెట్టాలను కొన్నాడు భగవానుడు - సుగ్రీవంచ తారాంచ సాంగదాం సహలక్ష్మణః - వెంటనే తన ఎదుట వాడిపోయిన ముఖాలతో మౌనంగా ఉన్న సుగ్రీవుణ్ణి తారను అంగదుణ్ణి పరకాయించాడు. పక్కనే నిలుచున్న తన తమ్ముడు లక్ష్మణుడి వైపు చూచాడు. వారి యెడల సానుభూతి కలిగింది. వారితో సమానంగా వారి దుఃఖాన్ని తానూ పంచుకొన్నట్టు అభినయిస్తూ నోరు దెఱచి మరలా మాటాడసాగాడు. అభినయించటమే మిటంటారేమో. సర్వజ్ఞుడైన పరమాత్మ ఏది చూపినా చేసినా అది అనుభవం కాదు అభినయమే ననే మాట మరచిపోరాదు మనం. అనుభవ మల్పజ్ఞులమైన మనబోటి మానవులదే. ఈ సత్యమొకటి గుర్తుంటే వాల్మీకి రామాయణం కొనా మొదలు అర్థమవుతుంది మనకు. లేకుంటే అదంతా మనబోటి మానవుడి చరిత్రే. మాధవుడి చరిత్ర కాదు.

**నకాలః కాలమత్యేతి - న కాలః పరిహీయతే**

**స్వభావంచ సమాసాద్య - నకశ్చి దతివర్తతే - 29**

ఏమంటున్నాడో తెలుసా రామబ్రహ్మం. నకాలః కాల మత్యేతి - న కాలః పరిహీయతే. కాలం కాలాన్ని దాటి పోలేదు. కాలమనేది ఎప్పుడూ లేకుండా పోదు. ఏమిటీ వాక్యాల కర్థం. కాలమంటే మానవుడి మనస్సు. కలనం చేసేది కాలం. అది ప్రతి ఒక్క విషయాన్నీ ఆలోచిస్తుంటుంది. అదే

కలనం. కాని ఒక విషయాన్ని మాత్రమది ఆలోచించలేదు. తన కన్నా అతీతంగా ఆలోచించే దొకటున్నది. తాను వ్యష్టి అయితే అది సమష్టి. సమష్టి మనస్సు Cosmic mind ఏదో గాదు. దానికే హిరణ్యగర్భ తత్త్వమని మహత్తని పేరు పెట్టారు. సగుణమైన ఈశ్వర శక్తే అది. క్రియా శక్తి – Cosmic Cretative Power.

పరిపూర్ణ జ్ఞాన మన్నప్పుడు దాని శక్తి కూడా పరిపూర్ణమే. అది ఆ జ్ఞానానికన్నా వేరు కాదు మరలా, దానితో అవినాభూతమే Inseperable పరాస్య శక్తిః స్వాభావికీ అని శాస్త్ర వచనం. అయితే శక్తి గనుక అది ఊరక కూచోదు. వివిధైవశ్రూయతే. ఇచ్ఛా జ్ఞాన క్రియా ఫలానుభవ రూపంగా అనేక భంగిమలలో బయటపడి కనిపిస్తుంటుంది. అంతకు ముందు దశ అవ్యక్తమైతే బయటపడ్డ దశ వ్యక్తం. ఈ వ్యక్త దశే సంసారం. రెండూ అదే. ఆ మాయాశక్తి స్వరూపమే. స్వభావమే.

స్వభావంచ సమాసాద్య నకశ్చి దతి వర్తతే స్వభావ మన్నప్పుడది సర్వవ్యాపకం. మన మనస్సూ దీని ఆలోచనలూ దీని సుఖదుః ఖాద్యనుభవాలూ కూడా దాని విలాసమే కావలసి వస్తుంది. పరిమితం కూడా పరిపూర్ణంలో ఒక భావమే గదా. ఎటు వచ్చీ తానా పరిపూర్ణంలో ఒక శకలమేనని తెలియదీ మానవుడి మనస్సుకు. తెలియక దాన్ని దాటి పోవాలని చూస్తుంటుంది. అది వట్టి భ్రమ. తన స్వభావమే అయినప్పుడు స్వభావాన్ని ఎలా దాటిపోగలదు. మరేమిటి మార్గం. అది నా స్వరూపమేనని

పరిమితమైన తన మనస్సును పరిపూర్ణంగా మార్చుకోవటమే మార్గం. 'మహాంతం విభు మాత్మానం మత్వా' అని మహర్షులెప్పుడో సెలవిచ్చారీ లోకానికి.

**నకాలస్యాస్తి బంధుత్వం - నహేతు ర్న పరాక్రమః**

**న మిత్ర జ్ఞాతి సంబంధః - కారణం నాత్మనో వశః - 30**

ఈ పూర్ణ భావన లేనంతవరకూ కాలం కాలమని ఎంత వాపోయినా సుఖం లేదు. ఎంత దాన్ని ద్వేషించినా ప్రయోజనం లేదు. నకాలస్యాస్తి బంధుత్వం - దానికొకడు కావలసిన వాళ్లని లేదు. ఇంకొకరు పరాయివాళ్లని లేదు. మిత్రత్వం శత్రుత్వ మనే తేడా పరిమితమైన మానవుడి మనస్సుకే. పరిపూర్ణమైన భగవచ్ఛక్తి కేదీ లేదు. నహేతు ర్న పరాక్రమః హేతు పరాక్రమాలు కూడా లేవు దానికి. ఎందుకిలా జరుగుతుందనేది హేతువైతే ఈ జీవులనెలాగైనా పట్టి చూడాలనేది పరాక్రమం. సర్వవ్యాపకమైన ఈశ్వరశక్తి అంతా సమానమే. ద్వంద్వాల ప్రసక్తే లేదక్కడ. వైషమ్యముంటే గదా ద్వంద్వం. సర్వమూ సామ్యావస్థే అయినప్పుడు వైషమ్యమెక్కడిది.

అంతేకాదు. నమిత్రజ్ఞాతి సంబంధః వీడు మిత్రుడని. వీడు మన చుట్టమని ఇలాటి సంబంధ బాంధవ్యాలు దానికి లేవు. అలాటి సంబంధమే ఉంటే అయినవాణ్ణి రక్షించాలి కాని వాణ్ణి శిక్షించాలనే భేద భావ మేర్పడుతుంది. కారణం నాత్మనోవశః మరేమిటి కారణమంటారా. ఏదీగాదు. నీవశంలో లేదేదీ. ఏమి కారణమంటే నీది పరిమితమైన

సంకుచితమైన దృష్టి. దీనికి భిన్నంగా ఈశ్వర దృష్టి పరిపూర్ణం. పరిమితాన్ని శాసించేది పరిపూర్ణం. పరిపూర్ణాన్ని పరిమితం శాసించలేదు.

**నియతిః కారణంలోకే - నియతిః కర్మసాధనమ్**

**నియతి స్సర్వభూతానాం - నియోగేష్విహ కారణమ్ - 31**

ఆ ఈశ్వర శాసనమే నియతి Destiny ఇది ఇలాగే జరగాలి మరోలా జరగకూడదనే నియమం. సర్వానుల్లంఘ్య శాసనా అని అమ్మవారి నామం. ఎవరూ దాన్ని దాటిపోలేరు. నియతిః కారణంలోకే. అదే లోకంలో అన్నిటికీ కారణం. నియతిః కర్మసాధనం – మనంచేసే పనులు కాదు. చేయటానికి మనమెవరం. మనోవాక్కాయములతో మానవుడు చేసే ప్రతి కర్మకూ అదే సాధనం. అది చేయిస్తుంటే చేస్తున్నదీ మనసు ఆలోచన. మాటాడమంటే మాటాడుతున్నదీ వాక్కు. మంచీ చెడ్డా చేయమని పురమాయిస్తే చేస్తున్నదీ శరీరం. నియతిస్సర్వ భూతానాం నియోగేష్విహ కారణం ఇంతెందుకిన్ని మాటలు. సమస్త ప్రాణులూ ఏది సంకల్పించినా ఏది చేస్తున్నా అదంతా నియతి అనేది వెనకాల చేరి ప్రేరణ చేస్తుంటేనే జరుగుతుంటుంది. స్వతంత్రంగా ఎక్కడా ఏదీ సంభవం కాదు. కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతి జైర్గుణైః అని కృష్ణబ్రహ్మం చెప్పింది ఈ రామబ్రహ్మం చెప్పిన మాటే.

ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. మన జీవితమంతా ఆ ఈశ్వరశక్తికే వశమై నడుస్తుంటే ఇక మన ప్రయత్నమేమిటి. పురుష ప్రయత్నమే లేకుంటే పురుషార్ధమనేది ఎవరికి చెప్పినట్టు, పురుషుడర్ధించేది అనుభవానికి

తెచ్చుకోవలసిందిగదా పురుషార్ధమన్నారు. వాస్తవమే. అంతా ఈశ్వర శాసనమైనా ప్రయత్నాని కవకాశం లేకపోలేదు. ఏదో గాదది. అంతా ఈశ్వర స్వరూపమనే అఖండ భావనే ఆ ప్రయత్నం. అప్పుడు ఖండమైన ఈ మనస్సు అఖండమైన ఈశ్వర భావాన్ని అందుకొంటుంది. అప్పుడిక ఇదేమిటి ఇలా జరుగుతున్నది. ఎవరిలా చేస్తున్నారు. ఎందుకీ జీవులంటే దానికింత కక్ష అనే ప్రశ్నే రాదు. తానే ఆ ఈశ్వరుడు తనదే ఆ శక్తి.

**నకర్తా కస్యచిత్కశ్చి - న్నియోగే నాపిచేశ్వరః**

**స్వభావంచ సమాసాద్య - నకశ్చి దతి వర్తతే - 32**

అలాంటి పూర్ణానుభవ మేర్పడితే చెప్పు. అప్పుడొకడు కర్త ఒకడు భోక్త అనే ద్వైత భావన లేదు. ఎవడూ ఎవడికీ కర్త కాడు. ఎవడికెవడూ భోక్త కాడు. కర్త అయినా తానే భోక్త అయినా తానే. నియోగే నాపి చేశ్వరః – ఒకరిని శాసించటానికి కక్కడ ఒక ఈశ్వరుడుంటే గదా. తనకు తానే అన్నప్పుడీశ ఈశితవ్య భావమే ఎగిరిపోయింది. మరి అలాంటప్పుడా పరాశక్తి ఏమయింది. ఏమవుతుంది. స్వభావే వర్తతే లోకః అప్పుడా మానవుడి స్వభావమే అవుతుందది. తన శక్తినంతా వ్యాపించి అందులోనే తానుంటాడు. తనలో అది దానిలో తాను. శక్తి శక్తిమంతులనే తేడా లేదు. అదే చెబుతున్నాడు పరమాత్మ. తస్యకాలః పరాయణం – నరుడప్పుడు నారాయణుడే గనుక కాలమనే క్రియాశక్తి వాడికి పరాయణ మవుతుంది. పరమయనం పరాయణమని వ్యుత్పత్తి. సర్వవ్యాపకమైన తన శక్తినే

తనకధిష్ఠానంగా Basis చేసుకొంటాడు. అంటే అర్థం. సద్రూపంగా వ్యాపించిన తన శక్తిని తాను చిద్రూపంగా వ్యాపించి సచ్చిద్రూపంగా తన పాటికి తానే ఉండిపోతాడు.

**కింతు కాల పరీణామో - ద్రష్టవ్య స్సాధు పశ్యతా**

**ధర్మశ్చార్థశ్చ కామశ్చ - కాలక్రమ సమాహితాః - 33**

అలా ఉండిపోతాడంటే కదలిక మెదలిక లేకుండా ఒక జడ పదార్థంలాగా నిలబడిపోతాడని కాదు మరలా. కేవల సద్రూపుడే గాదు చిద్రూపుడు కూడా Not only existant but conscious of its existance నిశ్శేష్టంగా ఎలా ఉంటాడు. అన్నింటినీ గమనించే ప్రజ్ఞ కూడా ఉండి తీరుతుంది. ప్రజ్ఞానం బ్రహ్మ అని గదా శాస్త్ర వచనం. అయితే ఆ ప్రజ్ఞ తనలో ఏది జరుగుతున్నా దానికి సాక్షిభూతమే Spectator గాని కర్తృ భోక్తృ రూపం కాదు. కనుక జీవుడిలాగా బద్ధం కాదు. నిత్యముక్తం. ఆకార వ్యాపారాలలో దేనిలోనూ Forms and Functions దేనిలోనూ తగులుకోకుండా వాటిని ఉదాసీనంగా చూస్తూ ఉంటుంది.

ఏమిటది చూచే వ్యవహార మంటావా, కాలపరీణామః – తన క్రియాశక్తి ఎలా ఎలా మారుతూ చేస్తూ ఉంటుందో తాను మారకుండా ఆ మార్పులన్నిటినీ గమనిస్తుంటుంది. గమనిస్తుందని చెప్పానంటే అది ఎక్కడ ఉంది. మానవుడే తన నిజస్వరూపాన్ని ఎప్పుడు గుర్తిస్తాడో అప్పుడు తానే అది అయి అలా తన మాయాశక్తి విలాసాన్ని గమనిస్తుంటాడని భావం.

ద్రష్టవ్యః – సాధన చేసి అలాటి సర్వతోముఖమైన దర్శనాన్ని సంపాదించాలి. 'సాధు పశ్యతా' సంపాదించి తాను సర్వజ్ఞుడైతే తన విభూతిగా చూస్తాడీ సమస్తాన్నీ.

సమస్తమంటే ఏమిటను కొన్నావు. ధర్మశ్చార్ధశ్చ కామశ్చ – ధర్మమూ దాన్ని ఆచరించే ధార్మికుడూ అర్థమూ ఆర్థికుడూ – కామమూ కామికుడూ – మొత్తానికి ఇహపరాలూ వాటిలో బడిపోయే మానవుల మనో వ్యాపారాలనూ వారి వారి ఫలానుభవాలనూ అన్నింటినీ అలాగే నిర్లిప్తంగా నిలిచి చూస్తుంటాడు. చూస్తుంటే వాడు సిద్ధుడు. అది నీవూ నేనూ అలవరుచు కొంటూ పోతే సాధకులం. ఎప్పటికైనా ఏ మానవుడైనా అలా దర్శించే సాధన చేయాలని అప్పుడే ఆ స్థితి నందుకోగలడని భగవానుడి ఉపదేశం. అందుకొన్నవాడి దృష్టికీ లోక వ్యవహారమంతా ఎలా కనిపిస్తుంది. 'కాలక్రమ సమాహితాః' పురుషార్థాలూ వాటినర్థించే పురుషులూ అంటే మానవులూ అంతా ఈశ్వరీయమైన కాలమనే క్రియాశక్తిలో సుళ్లు తిరుగుతూ ఒక నాటక ప్రదర్శనలాగా దర్శనమిస్తుంది. ఎటువచ్చీ అలా చూడాలి వివేకవంతుడైన ప్రతి మానవుడూ. అప్పుడే శాంతి. లేకుంటే సాంసారికమైన అశాంతికి లోనుగాక తప్పదు.

ఇక్కడ రామస్వామి మాటల్లో ధర్మార్థ కామాలు మూడే వినబడు తున్నాయి. మోక్షమనే నాలుగవ పురుషార్థం లేదిక్కడ. ఇది చాలా సాభిప్రాయమైన వాక్యం. ఎంచేతనంటే మోక్షావస్థ మిగతా మూడు

పురుషార్థాలలాగా దృశ్యం కాదు. అది కేవలం దర్శనమే. కనుక దాన్ని వాటిలో చేర్చలేదు. అంచేతనే ధర్మార్థ కామాలు మూడూ త్రివర్గమనీ మోక్షాన్ని ఒక్కదాన్నీ అపవర్గమనీ శాస్త్రం పరిగణించింది.

**ఇతః స్వాం ప్రకృతిం వాలీ - గతః ప్రాప్తః క్రియాఫలం**

**సామదానార్థ సంయోగైః - పవిత్రం ప్లవగోత్తమః - 34**

**స్వధర్మస్యచ సంయోగా - జ్జితస్తేన మహాత్మనా**

**స్వర్గః పరిగృహీతశ్చ - ప్రాణానపరిరక్షతా - 35**

**ఏషావై నియతిః శ్రేష్ఠా - యాంగతో హరియూథపః**

**తదలం పరితాపేన - ప్రాప్తకాల ముపాస్యతాం - 36**

అయితే అలాటి మోక్షాన్ని అందుకొన్నాడని చెప్పలేనీవాలి. అంతటి బ్రహ్మ జ్ఞాన సంపన్నుడు కాడు. నిజమైన జ్ఞాని కహం మమ లుండరాదు. అవి ఉన్నంతవరకూ మిధ్యాత్మ గౌణాత్మలే తన స్వరూపమని బోల్తా పడుతుంటాడు మానవుడు. బ్రహ్మాత్మ నాత్మగా భావించలేడు. కాబట్టి వాలి ఎంత పరాక్రమవంతుడైనా ఇతః స్వాం ప్రకృతింవాలీ గతః తన ప్రకృతి కనుగుణంగానే తాను జీవిస్తూ వచ్చాడు. జన్మాంతరంలో చేసుకొన్నది సంస్కార రూపంగా ఉండిపోయి అది వర్తమాన జన్మలో అభివ్యక్తమైతే దానికి ప్రకృతి అని పేరు పెట్టారు శాస్త్రజ్ఞులు. అందువల్లనే ప్రాప్తః క్రియా ఫలం - దాని కనుగుణంగానే ప్రవర్తించాడు జీవితంలో. ఆ ప్రవర్తనకు తగిన ఫలమే అనుభవించాడు. అయితే సామదానార్థాలు కూడా అందులో

కలిసి ఉన్నందు మూలాన పవిత్రం ప్లవగోత్తమః ఈ వానరోత్తముడు ఉత్తమమైన స్థితినే అందుకొన్నాడు.

ఏమిటది. జిత స్తే న మహాత్మనా స్వర్గః – స్వర్గలోకసుఖాన్నే. అదైనా ఎలాగంటే స్వధర్మస్యచ సంయోగాత్ – తనకు విహితమైన ధర్మమేదో అది తూచా తప్పకుండా పాటించాడు. ప్రాణా నపరిరక్షతా – ప్రాణాలను కూడా పణంగా పెట్టాడు. జనరంజకంగా రాజ్యం చేశాడు. వీరోచితంగా ప్రతి వీరులతో పోరాడాడు. కనుకనే స్వర్గః పరిగృహీతశ్చ. వీర స్వర్గ మలంకరించ గలిగాడు.

ఇంతకూ మీరూ నేనూ విచారించవలసిందిది గాదు. ఈశ్వర నియతి తన్ను ఎలా శాసిస్తే అలా జీవించి వెళ్ళిపోయాడు వాలి. తదలం పరి తాపేన– అంచేత ఊరక అతణ్ణి గూర్చి పరితపించకండి. పరితపించినా ప్రయోజనం లేదు. అతనికి రావలసిన గతి ఏదో అది వచ్చేసింది. ప్రాప్తకాల ముపాస్యతాం – ప్రస్తుతం మీరాతని శరీరానికేయే సంస్కారాలు చేయాలో అది శాస్త్రోక్త రీతిలో చేసి మీ ఋణం తీర్చుకోండి. మా భక్తుడు హనుమంతుడు కూడా అదే గదా మీకు చెప్పాడు. అలాగే చేయండి. అంతకన్నా మీరాయనకు చేయగలిగిందేమీ లేదు. ఇదీ రాముని ప్రబోధం.

# పరిసమాప్తి

రామగీత ఇక్కడికి సమాప్తమయింది. భరతుడు వానరులనేది ఒక నెపం. అర్జునం నిమిత్తీకృత్య అన్నట్టు వారిని నిమిత్తంగా చేసుకొని కృష్ణుడి లాగానే రాముడు మానవ సమాజానికంతా చేసిన మహోపదేశమిది. మహత్త్వం పరిమాణంలో కానక్కరలేదు. గుణంలో ఉండాలి. ముందు చెప్పినట్టు కృష్ణగీతలోని ఏడువందల శ్లోకాల తాత్పర్యమూ ఈ రామగీతలో చాలా క్లుప్తంగా గుప్తంగా కనిపిస్తుంది మనకు. ఒక్కమాటలో చెబితే జ్ఞానమూ కర్మా ఇవి రెండే ఏ గీత చెప్పినా చెప్పగలిగింది. ఇందులో కర్మ అనేది నిషిద్ధం కాక విహితమైన దాచరిస్తే మరణానంతరం మానవు డుత్తమ లోకాలూ ఉత్తమ జన్మలూ ఉత్తమ సుఖాలూ ఇలాటి అభ్యుదయం సాధించగలదు. మరి జ్ఞానం కూడా సాపేక్షం కాక నిరపేక్షమైన బ్రహ్మ జ్ఞానమే గడిస్తే మరణమనే ప్రసక్తే లేక అజరామరుడై అనంతమైన ఆత్మ సామ్రాజ్యానికే పట్టాభిషిక్తుడై తన స్వరూపంలో తానుండి తన కన్యంగా కనిపించేదంతా తన విభూతిగా దర్శిస్తూ పోతాడు. ఇదీ రామకృష్ణో భయగీతా తాత్పర్యం. ఇందులో మనబోటి నరుల మందరమూ ధర్మంవరకే ప్రయాణం చేసి నరోత్తముల మవుతామో లేక జ్ఞానమనేది ఆర్జించి చివరకు నారాయణత్వాన్నే అందుకొని తరిస్తామో మనమే నిర్ణయించుకోవలసి ఉంది.